Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 29.08.2014, శుక్రవారం సంపుటి : 34 సంచిక : 13 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

# నాయుడే ముద్దు... నెల్లూరు వద్దు



## బాబు వింత వైఖరి

నెల్లూరుకు ఏమీ చేయవద్దు... నెల్లూరుకు ఇది కావాలని ఏమీ అడగొద్దు... నెల్లూరులో ఏ పరిశ్రమలూ పెట్టొద్దు... మంత్రులకు, పారిశ్రామికవేత్తలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేసిన సూచన ఇది. జిల్లాలో ఎన్నికల ఫలితాలు ప్రతికూలంగా రావడంతో చంద్రబాబు ఈ జిల్లాపై ప్రత్యేకంగా కసిని పెంచుకున్నాడు. ఇక్కడ ఒక్క అభివృద్ధి పని కూడా లేకుండా చేయాలన్నంత పగతో రగిలిపోతున్నాడు.

కాని చంద్రబాబుకు కేంద్రప్రభుత్వంతో అవసరమొచ్చేసరికి మాత్రం అదే నెల్లూరు జిల్లా నాయకుడి అవసరమొచ్చింది. జిల్లాకు చెందిన కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు ద్వారానే రాష్ట్రానికి కేంద్రం నుండి నిధులు సాధించేందుకు ప్రయత్నిస్తున్నాడు. బీజేపీలో ఒక్క వెంకయ్య తప్పితే చంద్రబాబుతో ఇంకెవరూ సన్నిహితంగా ఉండరు. అసలు మొన్న ఎన్నికల్లో (మిగతా 10వ పేజీలో)




రాష్ట్రంతో...

## రాజకీయ జూదం

### కేంద్రంలో తిరగని చంద్రబాబు చక్రం

### ఏపికి చేసే ప్రతి సాయంపై బీజేపీ ముద్ర

### 2019 కల్లా టీడీపీకి పోటీ కావడమే లక్ష్యం

రాష్ట్ర విభజనతో తరిగిపోయిన ఆస్తులు... కొండలా పేరుకు పోయిన అప్పులు... అంతకుమించి ఇబ్బడిముబ్బడిగా ఇచ్చిన హామీలు... ఇదీ రాష్ట్రం పరిస్థితి. ఎన్నికల్లో అధికారం కోసం అలవిగాని హామీలిచ్చిన చంద్రబాబుకు ఇప్పుడు వాటిని అమలు చేయడం సాధ్యం కాలేదు. విభజన ద్వారా 15వేల కోట్ల లోటుబడ్జెట్‌లోకి వెళ్లిన రాష్ట్రం లక్ష కోట్లకుపైగా ఋణమాఫీ, ఇంకొన్ని వేలకోట్లకు సరిపడా ఉచిత హామీలను తట్టుకోవాలంటే సాధ్యమయ్యే పనేనా? (మిగతా 10వ పేజీలో)

» నిస్సారంగా చర్చలు

» ఏకపక్షంగా సమావేశాలు

## అడ్డదిడ్డంగా అసెంబ్లీ



ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న తీరు చూస్తుంటే జుగుప్సాకరంగా ఉంది. అవి సమావేశాలో జాతరో అర్థం కావడం లేదు. ఆంధ్రరాష్ట్ర విభజనతోటే ఆంధ్రప్రదేశ్ శాసనసభ హుందాతనం పోయినట్లయ్యింది. సమావేశాలు వీధి కొట్లాటాలను తలపిస్తున్నాయి. సభను సజావుగా, హుందాగా నడిపించడంలో ప్రభుత్వం విఫలమవుతుంటే, అదే సమయంలో ప్రతిపక్ష వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ సైతం చర్చల మూలాలను వదిలి పక్కదారి పడుతుండడంతో మొత్తం శాసనసభ సమావేశాల నిర్వహణే ప్రశ్నార్థకంగా మారింది.

అసెంబ్లీలో ఎవరికి వాళ్లు పోటీ పడుతున్నారు. ఇప్పుడున్న సభ్యులలో చాలా మందికి ఆయా సమస్యలపై అవగాహన లేదు. కాకపోతే అవగాహన ఉందని చెప్పుకోవడానికి చేసే ప్రయత్నాలతో గందరగోళం చెలరేగుతుంది. ముఖ్యంగా అధికారపక్షమైతే తమ పరిపాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి అర్థం పర్థం లేని వాదనలతో ప్రతిపక్షంపైనే ఎదురుదాడికి పూనుకుంటుండడం మొత్తం సమావేశాల తీరునే తప్పు పట్టేలా వుంది.

గత ఎన్నికల్లో ఇచ్చిన ఏ హామీలను కూడా అమలు చేయలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉంది. రాష్ట్రంలో అన్నీ సమస్యలే... దీనికితోడు తెలుగుదేశం ప్రభుత్వం వచ్చాక పలు చోట్ల వైకాపా కార్యకర్తల హత్యలు, దాడులకు గురికావడం వంటివి జరిగాయి. వీటి మీద చర్చకు వైకాపా సభ్యులు పట్టుబడితే, మీ తండ్రి హయాంలో జరగలేదా, అంతకుముందు జరగలేదా అంటూ (మిగతా 10వ పేజీలో)



# సొంత పార్టీలో సవతి బిడ్డల్లా!

## జిల్లాలో తెదేపా నాయకుల విచిత్ర పరిస్థితి







***జిల్లాలో తెలుగు దేశంపార్టీ కార్యకర్తలు, నాయకులకు, వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు, నాయకులకు పెద్ద తేడా లేకుండా పోయింది. అధికారంలోకి వచ్చామనే సంతోషం తెలుగు దేశం వారిలో లేదు. వీరిని చూసి అధికారంలోకి రాలేకపోయామనే బాధ కూడా వైకాపా వారిలో లేకుండా పోయింది. సొంత పార్టీలో సవతి బిడ్డల్లాగా తయారయ్యామనే బాధ జిల్లాలోని తెలుగు తమ్ముళ్లలో అడుగడుగునా కనిపిస్తుంది.***

జిల్లా తెలుగుదేశం పార్టీలో రాజకీయాలు గందరగోళంగా ఉన్నాయి. పార్టీ ప్రతిపక్షంలో ఉన్న పదేళ్ల పాటు పోరాడిన ఏ నాయకుడికీ, కార్యకర్తకు ఇప్పుడు పార్టీ అధికారంలో వుందన్న ఆనందం లేదు. పార్టీ అధికారంలోకి వచ్చాక కూడా వీరి పరిస్థితి ప్రతిపక్షంలో ఉన్నట్లే వుంది.

జిల్లాలో మంత్రి పి.నారాయణ, ఆయన అనుచరులకు తప్పితే ఇంకెవరికీ ప్రాధాన్యత దక్కడం లేదనే ప్రచారం జరుగుతుంది. పదేళ్లకాలంలో నారాయణ గాని, ఆయన అనుచరులు గాని ఎప్పుడూ పార్టీ కార్యక్రమాలలో పాల్గొన్న దాఖలాలు లేవు. అదీగాక ఈమధ్య నారాయణ ముఖ్యఅనుచరులమని చెప్పి పెత్తనం చేస్తున్నవాళ్లు కాంగ్రెస్, వైకాపాల నుండి వచ్చిన వాళ్లే! వీళ్ల పెత్తనాన్ని సీనియర్ తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు సహించలేకపోతున్నారు. కాని వీళ్లకు అవకాశం రావడం లేదు. ముఖ్యంగా మేయర్ అజీజ్‌ను ఆనం వెంకటరమణారెడ్డిని పార్టీలో చేర్చుకున్నప్పటి నుండి చిచ్చురేగింది. పార్టీ సీనియర్ నాయకులతో చర్చించకుండానే వీరిని పార్టీలోకి తీసుకున్నారు. పార్టీలోని మిగతా నాయకులెవరు కూడా వీరికి సహకరించడం లేదు. పార్టీ నాయకులు ఈ పరిణామాలపై బహిరంగంగానే తమ అసంతృప్తిని వెళ్లగక్కారు. ఇక ఆదివారం వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో జరిగిన వార్షికోత్సవ వేడుకలకు చంద్రబాబు హాజరయ్యారు. అయితే ఇక్కడ కూడా మంత్రి నారాయణ, మేయర్ అజీజ్‌లకు తప్ప, ఇంకెవరికీ ప్రాధాన్యత దక్కలేదు. తెలుగుదేశం సీనియర్ నాయకులకు ఇక్కడ అవమానాలు ఎదురయ్యాయి. కనీసం చంద్రబాబును కలిసే అవకాశం కూడా లేక తెలుగుదేశం నాయకులు వెనుదిరిగి రావాల్సి వచ్చింది. ఇలాంటి పరిణామాలతో పార్టీ అధికారంలోకి వచ్చిందన్న సంతోషం నాయకులలో ఏ మాత్రం కనిపించడం లేదు.

రాష్ట్రంలో ఏర్పడుతున్న రాజకీయ పరిస్థితులను ఆసరగా తీసుకుని నెల్లూరు జిల్లాలోనూ పార్టీని బలోపేతం చేయాలని బీజేపీ నాయకులు సన్నాహాలు చేస్తున్నారు.

# బలపడే దిశగా బీజేపీ!

కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ సమర్ధవంతమైన పాలనతో పాటు జిల్లాకు చెందిన కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు సహకారంతో పార్టీని ముందుకు తీసుకెళ్లాలని, ఇకముందు కూడా మరుగుజ్జుగానే ఉండిపోతే తాము ఇక్కడే ఉండిపోతామని నాయకులు భావిస్తున్నారు.

నెల్లూరుజిల్లాలో బీజేపీకి గణనీయంగా సీట్లు సాధించిన చరిత్ర లేకున్నా అన్ని నియోజకవర్గాల్లో బలమైన కేడర్ వున్న చరిత్ర మాత్రం ఉంది. ఈ జిల్లా నుండి బీజేపీ తరపున ఎన్నికైన ఏకైక ఎమ్మెల్యే వెంకయ్యనాయుడు మాత్రమే. ఉదయగిరి నుండి 1978లో జనసంఘ్ అభ్యర్థిగా, 1983లో బీజేపీ అభ్యర్థిగా ఆయన విజయం సాధించారు. ఆ తర్వాత జరిగిన ఏ ఎన్నికలలోనూ బీజేపీ పార్టీ వాళ్లు ఎమ్మెల్యేలుగా గెలవలేదు. ఎంపీలు కాలేదు. ప్రతి ఎన్నికల్లోనూ ఆ పార్టీ సొంతంగానో, లేక తెలుగుదేశం పొత్తుతోనో పోటీ చేస్తూ వుంది. ప్రతి ఎన్నికలప్పుడు ఆ పార్టీ బలం క్రమక్రమంగా తగ్గుతూ వచ్చింది. దీనికి కారణం తెలుగుదేశం అధికారంలో ఉన్న కాలంలో బీజేపీ పార్టీ కేడర్ అంతా టీడీపీలోకి పోవడమే.

1983, 85 ప్రాంతంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలోనూ బీజేపీకి సొంత కేడర్ ఉండేది. ఇప్పుడు ఒక్క నియోజకవర్గంలోనూ బలంగా లేకుండా పోయింది.

ప్రస్తుతం రాష్ట్రంలోనే రాజకీయ పరిస్థితులు వేరుగా ఉన్నాయి. ఇటీవలవరకు బీజేపీని చిన్నచూపు చూసిన వాళ్లంతా ఇప్పుడు ఆ పార్టీలో చేరడానికి ఉత్సాహం చూపుతున్నారు. వైకాపాలో ఇమడలేని నాయకులు, కార్యకర్తలు బీజేపీ వైపే మొగ్గు చూపుతున్నారు. అలాగే తెలుగుదేశంలోనూ కొన్ని వర్గాలకు ప్రాధాన్యత దక్కడం లేదు. వాళ్లంతా కూడా బీజేపీనే ప్రత్యామ్నాయంగా ఆలోచిస్తున్నారు. జిల్లాలో ఇంకా కొంత కాంగ్రెస్ కేడర్ మిగిలివుంది. వీళ్లు కూడా బీజేపీలో చేరే అవకాశముంది. ఈ పరిస్థితులను అవకాశంగా తీసుకుని పార్టీని బలోపేతం చేసే దిశగా బీజేపీ నాయకులు సన్నాహాలు చేస్తున్నారు.



# తేలని ఇసుక పంచాయతి!

## అయోమయంలో సిండికేట్‌లు

రాష్ట్రంలో ఇప్పుడు వ్యాపారులకే కాదు, అధికారులకు, ప్రభుత్వానికి కూడా అతిపెద్ద ఆదాయ మార్గం ఇసుక. దోచుకున్నోళ్లకు దోచుకున్నంత. ఒకప్పుడు ఇసుక గురించి ఎవరూ పట్టించుకునేవాళ్లు కాదు. కాని కాలక్రమంలో మంత్రుల స్థాయి నాయకులు కూడా ఇసుక కాంట్రాక్టర్లుగా అవతారమెత్తే పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి.

కాంట్రాక్టర్లకు, అధికారులకు కాసుల వర్షం కురిపించే ఇసుకపై కొత్తగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు ఎటువంటి పాలసీని ప్రకటించకపోవడంతో ఇసుక కాంట్రాక్టర్లు అయోమయంలో పడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణాజిల్లా తర్వాత అత్యధికంగా ఇసుక వ్యాపారం జరిగేది నెల్లూరు జిల్లాలోనే! పెన్నా పరివాహక ప్రాంతంలో లభించే ఇసుకకు స్థానికంగానే కాక ప్రకాశం, చిత్తూరు, కడప, కర్నూలు జిల్లాలతో పాటు చెన్నై, బెంగుళూరు వంటి నగరాలలో మంచి డిమాండ్ ఉంది.

సీఎంగా కిరణ్ రాకముందు వరకు కూడా అన్ని ఇసుకరీచ్‌లకు టెండర్లు మరియు వేలం ప్రక్రియ ఉండేది. ఇసుకరీచ్‌ల వేలం ద్వారా ప్రభుత్వానికి కోట్లలోనే ఆదాయం వచ్చేది. ఇసుక వ్యాపారులకు ఇతర ప్రాంతాలకు ఇసుక రవాణా ద్వారా రెట్టింపు ఆదాయం ఉండేది. ఇక వివిధ శాఖల అధికారులకు చిల్లర బాగానే ముట్టేది. కేవలం ఇసుక లారీల వద్ద దండిన మామూళ్లతోనే ఇళ్లు, స్థలాలు, కార్లు కొన్న పోలీసులు, ఇతర శాఖల సిబ్బంది కూడా ఉన్నారంటే అతిశయోక్తి కాదేమో! కిరణ్ సీఎం అయ్యాక ఇసుకరీచ్‌లకు వేలంపాటల బదులు ఆయా గ్రామాల వారీగా లక్కీడిప్‌లు నిర్వహించారు. లాటరీలో పేరొచ్చిన వారికి ఇసుకరీచ్‌లు కేటాయించారు. ఇలా లాటరీలో పేరు తగలడమంటే నక్కతోకను తొక్కడమే! అయితే లాటరీ విధానం ద్వారా ప్రభుత్వాదాయానికి భారీగా గండిపడసాగింది.

రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం వచ్చింది. ఇసుక మీద అధ్యయానికి ఒక కమిటీని వేసి ఇతర రాష్ట్రాలకు పంపించారు. ఇసుకరీచ్‌లకు పాతపద్ధతిలోనే వేలంపాటలు పెట్టాలా లేక డ్వాక్రా మహిళలకు ఇవ్వాలా? అదీకాక ప్రభుత్వమే ఇసుకరీచ్‌లను నిర్వహించాలా? అనేదానిపై ఇంకా ఒక స్పష్టత రాలేదు. ఇసుకరీచ్‌లలో డ్వాక్రా మహిళలకు కొంత భాగస్వామ్యం కల్పించడం ఖాయంగా కనిపిస్తుంది. మిగతా నిర్వహణను ప్రభుత్వమే చూస్తుందా? లేక వేలం పాటలు పెడతారా అనేది తేలాలి. ఇసుక సిండికేట్‌లు మాత్రం డబ్బులు రెడీగా పెట్టుకుని వున్నాయి. ప్రభుత్వం ఏదో ఒకటి తేలిస్తే ఆ డబ్బుతో ఇంకో వ్యాపారం చేసుకుంటామనేది వారి ఉద్దేశ్యం. ఓ పక్క అక్రమ ఇసుక రవాణా ఆగడం లేదు. కొన్ని రీచ్‌ల నుండి ప్రతిరోజు రాత్రివేళల్లో వందలకొద్ది ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ఇసుక తరలిపోతుంది. ఇసుకపై ఈ ప్రభుత్వం ఏదో ఒకటి తేలిస్తే తాము ఈ వ్యాపారంలో ఉండడమా లేక ఇంకేదైనా వెదుక్కోవడమా చేసుకుంటామని కాంట్రాక్టర్ల ఆవేదన.



# వదులుతోంది మొద్దు నిద్ర

## పోలీస్‌పై సెంథిల్ ముద్ర

సింగపూర్, మలేసియా వంటి దేశాలలో మనకు రోడ్లపై పోలీసులు కనిపించరు. పోలీసులు లేరని మనం ధైర్యంగా ఏ చిన్న నేరానికైనా పాల్పడ్డామా, నిముషాల వ్యవధిలో పోలీసులు మన ముందుంటారు. మన చేతులకు సంకెళ్లు ఉంటాయి. అంత అప్రమత్తంగా ఉంటుంది అక్కడి పోలీసు వ్యవస్థ. కాబట్టే అక్కడ నేరాలు తక్కువ. కాని మన దేశంలో చూస్తే... హత్య జరుగుతుందని ముందే సమాచారమిచ్చినా పోస్ట్‌మార్టం టైంకు పోలీసులొస్తారు. అయితే ఇక్కడ తప్పు పోలీసులదే కాదు, వ్యవస్థలను ఆ విధంగా తయారుచేసి పెట్టిన ప్రభుత్వాలది కూడా!

సింగపూర్ వంటి దేశాలలో రోడ్లపై పోలీసులు లేకున్నా ప్రజలు క్రమశిక్షణతో నడుచుకుంటారు. ఆఖరకు ఒక ట్రాఫిక్ సిగ్నల్‌ను దాటిపోవడానికి కూడా ఎవరూ సాహసించరు. కాని నెల్లూరు కెవిఆర్ పెట్రోల్‌బంకు సెంటర్‌లో కానిస్టేబుల్ కనిపించకుంటే రెడ్‌సిగ్నల్ పడివున్నా వాహనదారులు పోతూనే వుంటారు. మన పోలీసు వ్యవస్థ పట్ల ప్రజలు ఏర్పరచుకున్న మానసిక స్థితికి ఇది అద్దం పడుతుంది. అంటే ఇక్కడ రోడ్డు మీద పోలీసు కనపడితేనే ప్రజల్లో భయం ఉంటుంది. అంటే ఇక్కడి ప్రజలు ఆ విధంగా అలవాటు పడిపోయారు.

గత కొన్నేళ్లుగా జిల్లాలో పోలీసు పనితీరు చచ్చుబడిపోయింది. ముఖ్యంగా ఎస్పీలుగా వచ్చిన వాళ్లంతా కూడా తిన్నామా, పడుకున్నామా అన్నట్లుగా ఉండిపోవడంతో మిగతా పోలీసులు వారినే అనుసరించారు. 1999-2000 కాలంలో పనిచేసిన కె.శ్రీనివాసరెడ్డి హయాంలో పోలీసు పవర్ ఏ విధంగా ఉంటుందో ప్రజలు చూసారు. ఆ తర్వాత వచ్చిన కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి, శివధర్ రెడ్డిలు ఫర్వాలేదనిపించారు. ఆపై వచ్చిన అధికారులంతా ఒకరిని తలదన్నేలా మరొకరు ఉదాశీన వైఖరిలో పోటీపడ్డారు. దీంతో పోలీసు పనితీరు గ్రాఫ్ క్రమంగా పడిపోతూ వచ్చింది. గత ఎస్పీ నవదీప్ సింగ్ అయితే ఎస్పీ ఉద్యోగాన్ని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ జాబ్ మాదిరిగా చేసుకుని వెళ్లిపోయారు.

ఐపిఎస్‌ల బదిలీలో భాగంగా సెంథిల్‌కుమార్ జిల్లా ఎస్పీగా వచ్చాక పోలీసు శాఖలో కదలిక మొదలైంది. పోలీసులకు బాగానే పని పెడుతున్నాడు. అందరూ ఒళ్లు వంచుతున్నారు. రోడ్ల మీద పోలీసులను బాగానే తిప్పుతున్నాడు. అక్రమాలకు, అరాచకాలకు కళ్లెం వేసేలా పోలీసు పనితీరు మెరుగుపడుతుంది. పోలీసుల నుండి ప్రజలు ఆశించే పనితీరు ఇప్పుడు కనిపిస్తుంది.



• ప్రభుత్వం కరుణిస్తే...

# రవాణాలో బ'కింగే'!

ఒకప్పుడు సరకు రవాణాలో జల మార్గానికే ఎక్కువ ప్రాధాన్యత ఉండేది. కాలక్రమంలో మోటారువాహనాలు దానిని అధిగమించాయి. అయితే ప్రస్తుతం పోర్టులు, జలరవాణాకు పాత ప్రాముఖ్యత ఏర్పడింది. ఈ క్రమంలో ఆంధ్రా-తమిళనాడు రాష్ట్రాల మధ్య విస్తరించివున్న బకింగ్‌హామ్ కెనాల్ పునరుద్ధరణపై చర్చలు జరుగుతున్నాయి. బ్రిటీష్ వారి కాలంలో బంగాళాఖాతానికి సమీపంలో ఆంధ్రలోని కాకినాడ నుండి తమిళనాడులోని కలివేలి ట్యాంక్ వరకు బకింగ్‌హాం కెనాల్ ఉంది. ఈ కాలువ నిర్మాణం ఓ అద్భుతమనే చెప్పుకోవాలి. రెండు రాష్ట్రాలలోనూ దాదాపు 1500కిలోమీటర్ల మేర ఈ కెనాల్ విస్తరించి వుంది. బ్రిటీష్‌కాలంలో ప్రధాన సరకు రవాణా మార్గంగా ఈ కెనాల్ ఉపయోగపడింది. కాలక్రమంలో ఈ కెనాల్ ఆక్రమణలకు గురికాసాగింది. ఇప్పుడు పూర్తిగా రూపురేఖలు మారిపోయాయి.

అయితే ఈ కెనాల్ పునరుద్ధరణపై కేంద్రప్రభుత్వం దృష్టి పెట్టింది. వచ్చే నెల 1వ తేదీ నుండి కెనాల్ ఆక్రమణలు, సరిహద్దుల నిర్ణయం వంటివాటిపై సర్వేకు శ్రీకారం చుడుతున్నారు. జలరవాణాకు ప్రాధాన్యతనిస్తున్న మోడీ హయాంలో దీనికి పూర్వవైభవం వస్తుందని అందరూ భావిస్తున్నారు. 2007లో జరిగిన సర్వేలోనే ఈ కాలువ పునరుద్ధరణకు 1400కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు. ఇప్పుడు ఇంకా ఎక్కువ ఖర్చు కావచ్చు. అయితే భూసేకరణ సమస్య లేదు కాబట్టి కాలువ పూడికతీసి దీనికి పూర్వవైభవం తేవడం సులభమే! ఈ కాలువను పునరుద్ధరిస్తే థాయ్‌లాండ్ వంటి దేశాల్లోలాగా ఈ కాలువలోనే వ్యాపారాలు సాగించవచ్చు.

# కీలక పదవిలో 'విజయ'సాయిరెడ్డి!



**ప్రఖ్యాత ఆడిటర్‌గా, తిరుమల తిరుపతి దేవస్థానాల కార్య వర్గ సభ్యుడిగా, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ డైరెక్టర్‌గా అన్నింటినీ మించి డా॥ వై.యస్.రాజశేఖరరెడ్డి కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా తెలుగు వారందరికీ సుపరిచితుడైన వేణుంబాక విజయసాయిరెడ్డిని వై.యస్.ఆర్. కాంగ్రెస్‌పార్టీ కీలక పదవిలో నియమించింది. పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఆయనకు బాధ్యతలు అప్పజెప్పింది.**

ఇన్నాళ్ళు ఆడిటర్‌గానే వున్న సాయిరెడ్డి ఈ పదవితో రాజకీయ ఆరంగేట్రం చేసినట్లుగా అయ్యింది. ఆయన డా॥ రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో సైతం అనేక కీలక నిర్ణయాలకు సూత్రధారిగా వున్నా అప్పట్లో ఆయన పేరు తెరవెనుకే వుండేది. వై.యస్. మరణానంతరం 'జగన్' సారధ్యంలో ఏర్పడిన వై.యస్.ఆర్. కాంగ్రెస్‌లో ఇప్పుడాయన కీలక వ్యక్తిగా ఎదిగాడు. విధివిధానాలను రూపొందించడంలోనూ, పటిష్టమైన ప్రణాళికలను అన్ని విభాగాలలో రూపొందించడంలోనూ సాయిరెడ్డి దిట్ట. కొన్ని దశాబ్దాలుగా ఆయన వై.యస్. కుటుంబానికి ఆడిటర్‌గా ఉన్నారు. కేవలం ఆడిటర్‌గానే కాక ఆ కుటుంబానికి ఆంతరంగికుడిగా కూడా విజయసాయిరెడ్డిని వై.యస్. కుటుంబం భావిస్తుంది. ఒకప్పట్లో విజయసాయిరెడ్డి వెంకటగిరి నియోజకవర్గం నుండి పార్టీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో వుంటారని ప్రచారం జరిగినప్పటికీ కొన్ని కారణాల చేత ఆయన ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా వున్నారు. అయితే ప్రస్తుతం పార్టీ వున్న పరిస్థితుల్లో విజయసాయిరెడ్డి వంటి మేధావుల సూచనలు, సలహాలతో పాటు పార్టీని బలోపేతం చేయడానికి ఇలాంటి వారి సేవలు అవసరమనే ఆలోచనతో 'జగన్' సాయిరెడ్డికి ప్రధాన కార్యదర్శి పదవి అప్పజెప్పినట్లు సమాచారం. వై.యస్.ఆర్. కాంగ్రెస్‌పై లక్షలాదిమంది పెట్టుకున్న ఆశలు నెరవేర్చే దిశగా వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ఆయన కొత్త యంత్రాంగం పనిచేస్తుందని వై.యస్.ఆర్. కాంగ్రెస్‌పార్టీ శ్రేణుల ఆశ.. ఆకాంక్ష.

నెల్లూరుజిల్లా వాడైన విజయసాయిరెడ్డికి 'జగన్' పార్టీలో ముఖ్యపదవి లభించడంతో జిల్లాకు చెందిన ఆయన ఆప్తులు ఆత్మీయులు చిన్ననాటి మిత్రులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. పార్టీని గాడిన పెట్టగలిగే సమర్థత, సత్తా సాయిరెడ్డికి వున్నాయని 'జగన్' సరయిన సమయంలో మంచి నిర్ణయం తీసుకున్నాడని వారు అభిప్రాయపడ్డారు. "విజయ"సాయిరెడ్డి రాక పార్టీకి ఇక అన్నీ విజయాలే కట్టబెడుతుందన్న ఆశాభావాన్ని కూడా వ్యక్తపరుస్తున్నారు.



# మారిన మనిషి!

నెల్లూరు గ్రామీణ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి పబ్లిక్‌లో ఒక మాస్ ఇమేజ్ వుంది. మనిషి ఆకారంతో పాటు ఆయన వెనుక వుండే మందీ మార్బలం కూడా ఈ ఇమేజ్‌కు కారణం కావచ్చు. అయితే పదిమంది కోసం మనం పని చేస్తున్నప్పుడు పదిమందితో కలిసి నడవాల్సినప్పుడు, ఆ పదిమంది మెచ్చేలా మన ఆహార్యంతో పాటు నడవడిక కూడా ఉండాలి. ప్రజలు ఏ విధంగా ఉంటే ఒక ప్రజాప్రతినిధిని ఆమోదిస్తారో ఆ విధంగా తనను తాను మార్చుకుంటున్నాడు కోటంరెడ్డి. ఇటీవల వరకు పెరిగిన గడ్డంతో కనిపించిన కోటంరెడ్డి ఇప్పుడు టీవీలలో చూసేవారికి సరికొత్త గెటప్‌తో కనిపిస్తున్నాడు. నున్నగా షేవింగ్ చేసుకుని నిగనిగలాడే బుగ్గలతో కనిపిస్తున్నాడాయన. ఇక అసెంబ్లీ సమావేశాలలో చూస్తే ప్రతిపక్షంలో జగన్ తర్వాత కోటంరెడ్డే ఎక్కువగా ఫోకస్ అవుతున్నాడు. ప్రజా సమస్యలపై ఆయన అడ్డదిడ్డంగా కాకుండా అర్ధవంతంగా మాట్లాడుతున్నాడు. ఎంతైనా ఏబివిపి పునాదుల మీద తన రాజకీయ భవనాన్ని కట్టుకున్నాడు కాబట్టి ఆయన మాటలోనూ, నడవడికలోనూ ఆ క్రమ శిక్షణ కనిపిస్తుంది. శాసనసభ సమావేశాలలో కోటంరెడ్డి ప్రసంగిస్తున్న తీరు కూడా అందర్నీ ఆకట్టుకుంటోంది. ఎన్నికల తర్వాత రాజకీయ శత్రువు, మిత్రులు అన్న తేడా లేకుండా అందరితో సత్సంబంధాలు ఏర్పరచుకుంటున్న కోటంరెడ్డి ఇప్పుడు అసెంబ్లీ సమావేశాలలోనూ తన ప్రత్యేకత ను చాటుకుంటున్నాడు. ఒక సామాన్యుడు శాసనసభ్యుడైతే రాజకీయాలు ఎంత హుందాగా ఉంటాయో చాటిచెబుతున్నాడు.

• వైసిపిలో సరికొత్త ప్రక్షాళనం

# ప్రసన్నకు పెత్తనం

2014 ఎన్నికల్లో అధికారంలోకి రావాల్సిన వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ ప్రతిపక్షానికే పరిమితం కావాల్సివచ్చింది. దీనికి కారణాలు అనేకం. వీటిలో



ఒక కారణమే ఆయా జిల్లాల నాయకత్వాన్ని సమర్ధవంతమైన వ్యక్తులకు అప్పగించక పోవడం. జగన్ వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీని స్థాపించాక జిల్లా పార్టీ కన్వీనర్‌గా కాకాణి గోవర్ధన్‌రెడ్డిని పెట్టాడు. ఇంతవరకు బాగానే వుంది. జిల్లాలో పార్టీని పటిష్టం చేయడానికి కాకాణి బాగానే కష్టపడ్డాడు. మొన్నటి ఎన్నికల వరకు ఆయననే కొనసాగించి ఉంటే పోయిండేది. కాని మధ్యలో మేకపాటి సోదరులకు వర్గ పిచ్చి తలకెక్కింది. ఆ సీట్లో తమ మనిషే ఉండాలనుకుని కాకాణిని పక్కన పెట్టే దాకా నిద్రపోలేదు. కాకాణి తర్వాత తమ మనిషిగా మేరిగ మురళీధర్‌ను (మిగతా 10వ పేజీలో)




నూతన ప్రారంభం ! నేడే శుభారంభం !!
తేది 31-8-2014, ఆదివారం ఉ॥ 9-00 గం.లకు
విజయ చిన్నపిల్లల హాస్పిటల్
విజయ లేబొరేటరి, ఇందిరాభవన్ రోడ్డు, నెల్లూరు
e-mail : drmrsreddy@gmail.com website : www.obesityclinic2000.com



డా॥ యం. రాజశేఖర్‌రెడ్డి
M.B.,B.S., D.N.B., Paediatrics
Vijaya Hospital, Chennai
PAEDIATRICIAN & NEONATOLOGIST
(చిన్నపిల్లల & పురిటిపిల్లల వైద్యనిపుణులు)
చెన్నై, విజయ హాస్పిటల్ నందు అనుభవం గడించి నెల్లూరులో నూతనముగా ప్రారంభిస్తున్నారు.
కావున ప్రజలు సేవలను వినియోగించుకోగలరు.
సెల్ : 96403 25252
అందరికీ ఇదే మా ఆహ్వానము !








## తిలా పాపం తలా పిడికెడు

ఓట్లు, సీట్ల కోసం ఆంధ్రప్రదేశ్ పునర్ అవస్థీకరణ బిల్లు(ఇరు ప్రాంతాలకు అవస్థలు కల్పించే బిల్లు)ను లోక్‌సభలో ప్రవేశపెట్టి, సాధారణ ఎన్నికల్లో 44సీట్లు మాత్రమే తెచ్చుకుని, ప్రతిపక్ష హోదా కోసం దేబిరించే పరిస్థితి తెచ్చుకోవడం ద్వారా కాంగ్రెస్‌పార్టీ భారీమూల్యం చెల్లించుకుంది. ప్రపంచాన్నే జయించాలన్న అలెగ్జాండర్‌లాగా అవస్థీకరణ బిల్లుకు మద్దతిచ్చి, ప్యాకేజీలంటూ సీమాంధ్రను మభ్యపెట్టి, ఇరుప్రాంతాల్లో పాగా వేయాలనుకుని, పాగా వేయలేకపోగా, ఇరు ప్రాంతాల్లో పొగబెట్టి సమస్యలతో ఊపిరాడకుండా చేసింది బీజేపీ. రెండుకళ్ళ సిద్ధాంతకర్త విభజనకు అనుకూలంగా లేఖ ఇచ్చి, ఇరు ప్రాంతాల్లో తిష్టవేసి పట్టు సాధించాలన్న అత్యాశకు పోయి ఒక కన్ను పోగొట్టుకుని అభినవ శుక్రాచార్యుడైనాడు నారా చంద్రబాబునాయుడు.

*కురుగూరు రంగనాథం,*
నెల్లూరు.

## తలా తోక లేదు

ముఖ్యమంత్రి చంద్రబాబులో గత పరిపాలనానుభవం ఏమైందో అర్థం కావడం లేదు. పరిపాలనలో చురుకుదనమే లేకుండా పోయింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఇష్టం లేకుండా బాధ్యతలు చేపట్టినట్లున్నాడు. ముఖ్యంగా కులపాలన ముద్ర పడుతుంది. రైతు, డ్వాక్రా ఋణ మాఫీపై స్పష్టత ఇవ్వడం లేదు. కొన్ని ప్రాంతాలను మాత్రమే అభివృద్ధి చేసే విధంగా ప్రభుత్వ విధానాలుంటున్నాయి. చంద్రబాబును అనుభవమున్న నేతగా ప్రజలు గెలిపించారు. ఈరోజు ఆ అనుభవం ఏమైందో?

*జె. భాస్కర్,* నెల్లూరు.

## లేని మనుష్యులపై విమర్శలా?

సభలో లేని వ్యక్తులపై విమర్శలు చేయడం సంస్కారమనిపించుకోదు. అసెంబ్లీలో తెలుగుదేశం సభ్యులు పదేపదే దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డిపై విమర్శలు చేయడం మానుకోవాలి. ఎల్లప్పుడూ గతం గురించే మాట్లాడుకుంటుంటే కాలాన్ని వృధా చేయడం తప్పితే ఇంకేమీ ఉపయోగం ఉండదు.

తోపు సుజాత, కావలి.

## 'ప్రభా'తం

రాష్ట్రంలోని పలు జిల్లాలు వర్షాభావంతో అల్లాడుతున్నాయి. అనేక ప్రాంతాల్లో క్రమేణా కరువు మేఘాలు కమ్ముకుంటున్నాయి. నిత్యం నీలిమబ్బుల దోబూచులాటలే తప్ప, వాన చినుకులు మాత్రం కురవడం లేదు. రైతన్నల కంటికొలుకుల్లోంచి బొటబొటా కన్నీటి చుక్కలు రాలుతున్నా వరుణుడికి మాత్రం కరుణ కలగడం లేదు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వున్న డెల్టా ప్రాంతాలు, మెట్ట ప్రాంతాలు, ముఖ్యంగా అనేక గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు, రైతులు వాన రాక కోసం నిత్యం నిరీక్షిస్తూనే వున్నారు. వానల్లు కురవాలి వాన దేవుడా..అంటూ చేతులెత్తి ప్రార్థిస్తూనే వున్నారు. అటు వర్షాలు రాక, చెరువులు దొరువుల్లో చుక్క నీరు లేక, భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో బోర్లు..మోటార్లలో సైతం నీరందక, రిజర్వాయర్ల నుంచి సాగునీరు సకాలంలో రాక..వేసుకున్న పైర్లు కళ్ళ ముందే ఎండిపోతుండడం చూసి రైతన్నల గుండెలు బాధతో..మూగవేదనతో ఘోషిస్తున్నాయి. అటు సాగునీటి కోసం, తాగేందుకు గుక్కెడు నీటి కోసం పలు ప్రాంతాలు తల్లడిల్లిపోతున్నాయి. ఎల్‌నినో ప్రభావమో లేక వరుణుడి ఆగ్రహమో తెలియదు కానీ, రాష్ట్ర వ్యాప్తంగా ఈ వ్యవసాయ సీజన్‌లో సకాలానికి సాగునీరు లేక రైతన్నలు పడే బాధలు వర్ణనాతీతంగా వుంటున్నాయి. వాస్తవానికి ఆగస్టు నెల అంటేనే వానల నెల అనే చెప్పవచ్చు. మామూలు వానలు కాదు.. భారీ వర్షాలు కురవాల్సిన నెల ఇది. అయితే, ప్రకృతి కరుణించకపోవడంతో వాన చినుకుల జాడ మాత్రం కనిపించడం లేదు..సరికదా, ఇంకా ఎండలు మండిపోతూనే వున్నాయి. ఎండలు మండే మే నెల దాటిపోయినా, జూన్ నెలలో వ్యవసాయసీజన్ ప్రారంభమై, తొలకరి వానలు కురుస్తాయని, పంటలు బాగా పండుతాయని ఆశపడిన రైతన్నలు అప్పోసప్పో చేసి పొలాల్లో పనులకు దిగినా..రోజులు గడుస్తూనే వున్నాయి కానీ, వానలు మాత్రం రావడం లేదు. జులై గడిచిపోయి, ఆగస్టు నెల కూడా అంచుల దాకా వచ్చినా, ఇంకా ఎండలు చండప్రచండంగా తమ ప్రతాపాన్ని చూపిస్తూనే వున్నాయి. కొన్ని జిల్లాల్లో అక్కడక్కడా వానలు కురిసినా.. నామమాత్రంగానే వుంటున్నాయి. అదునుకు పదునైన వర్షాలు కురవకపోవడంతో రైతన్నలు కుదేలైపోతున్నారు. వర్షాలు కురవాల్సిన దశలో ఎండలు మండిపోతుండడంతో ప్రజలు, రైతులు అల్లాడిపోతున్నారు. ఒకవైపు వేసుకున్న పంటలు, తోటలకు సక్రమంగా నీరందించలేక, నిన్న మొన్నటిదాకా విద్యుత్ బాధలతో బోర్లు, మోటార్లు సక్రమంగా పనిచేయక నిత్య వేదనలతో రైతులు ఆందోళన చెందుతూ వచ్చారు. ఇప్పుడు విద్యుత్ సరఫరా పరిస్థితి మెరుగుపడిందనే ఆనందం వున్నా, సకాలంలో పంటలకు సాగు నీరు అందని దుస్థితి ఏర్పడడంతో అనేక ప్రాంతాల్లో అన్నదాతలు అయోమయంలో వున్నారు. ఈ సీజన్‌లో ఇక వర్షాలు కురవకపోతే, వేసుకున్న పంటలపై ఆశలు వదులుకోవాల్సిందేనని వారు కన్నీటిపర్యంతం అవుతున్నారు. ఇదిలావుంటే, వరి పంట విస్తారంగా సాగయ్యే కృష్ణా, గుంటూరు, పశ్చిమ గోదావరి వంటి జిల్లాల్లోనూ సాగునీటి కష్టాలతో సేద్యం పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది. రిజర్వాయర్లలో నీళ్ళున్నా, రాష్ట్ర విభజన నేపథ్యంలో సకాలంలో నీటి విడుదలకు నోచుకోక, పంటపొలాలకు అదునుకు సాగునీరందక లక్షలాది ఎకరాల్లో పంటల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారడం ఆయా ప్రాంతాల రైతులను శోకసాగరంలో ముంచివేస్తోంది. వరికి పుట్టినిల్లయిన నెల్లూరుజిల్లాలోనూ కరువు మేఘాలు కమ్ముకుంటున్నాయి. ఈ జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో రైతులు పంటలు పండించుకోలేక కంటతడిపెడుతున్నారు. ఇక్కడి మెట్ట ప్రాంతాల పరిస్థితి మరింత దయనీయంగా వుంది. ఈ ప్రాంతాల్లో విస్తారంగా వేసుకున్న నిమ్మ, బత్తాయి వంటి పండ్ల తోటలు వర్షాభావంతో ఎండుముఖం పట్టాయి. ఈ సీజన్‌లో పచ్చగా కళకళలాడాల్సిన వరి పొలాలు నీటి తడి లేక వెలవెలబోతున్నాయి. కొన్నిచోట్ల మెట్ట ప్రాంతాల్లో వేసివున్న పంటలు బాగా ఎండిపోవడంతో ఇక ఆ పంటలను పశువులకు వదిలేసుకోవాల్సిన దైన్యస్థితి నెలకొంది. పల్లెపట్టుల్లో తాగు నీటికి, చివరికి పశుగ్రాసానికీ, మూగజీవాలకు తాగేందుకు గుక్కెడు నీరు దొరకని స్థితి ఏర్పడింది. వానాకాలం స్థానంలో మరో ఎండాకాలం దాపురించినట్లు జిల్లాలో **40** నుంచి **41** డిగ్రీల దాకా ఉష్ణోగ్రతలు పెరిగిపోయి, ఎండలు భగ్గుమంటున్నాయి. వర్షాకాలంలో వరద నీటి ప్రవాహాలతో జలజలా ప్రవహించాల్సిన పెన్నానది ఎండిపోయి, బిక్కముఖం వేసుకున్నట్లు కనిపిస్తోంది. భారీ వర్షాలు కురిసినప్పుడు, వరదలు వచ్చినప్పుడు ఆ నీటి ప్రవాహాలు వృధాగా సముద్రంలో కలసిపోతున్నా పాలకులు పట్టించుకోకపోవడంతో, ఇప్పుడు.. అవసరమైనప్పుడు సాగునీటికి నానా అవస్తలు పడాల్సి వస్తోంది. దాహమైనప్పుడు బావి తవ్వుకుందామనే నీరస, నిర్లిప్త వైఖరిలోంచి బయటపడి, ఇకనైనా ప్రతి నీటి చుక్కనూ పదిలపరచుకోగలిగితేనే భవిష్యత్తులోనైనా ఇలాంటి కష్టాల్లోంచి కొంతమేరకైనా ఉపశమనం లభిస్తుంది. నీటి ప్రవాహాలు వృధా కాకుండా ఎక్కడికక్కడ విస్తారంగా చెక్‌డ్యామ్‌లు కట్టుకోవడం, చెరువులను పటిష్టం చేసుకోవడం, వాటి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచుకోవడం, వ్యవసాయంలో, పంటల సాగులో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం, తక్కువ నీటి వినియోగంతో ఎక్కువ పంటలు పండించుకోవడం, బిందు సేద్యం వంటి వాటిని విస్తారం చేసుకోవడం, నీటి వనరులను పెంచుకోవడం, వనరులు లేని చోట ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించడం వంటి మార్గాలను అన్వేషించాలి. వానలు లేనప్పుడల్లా బాధలు పడేకంటే, ముందు జాగ్రత్తతో తగు ఏర్పాట్లు చేసుకోవడం ఏనాటికైనా శ్రేయోదాయకం. ప్రభుత్వం తక్షణం ఈ పరిస్థితులను గమనించి, రైతులకు ఈ సీజన్‌లో వెంటనే సాగునీరు అందించేందుకు వున్న మార్గాలన్నిటినీ వినియోగించి, అన్నదాతలను కరువు బారిన పడకుండా, ఏ రైతూ కన్నీరు పెట్టకుండా వారిని అన్నివిధాలుగా కాపాడుకోవాలి. పాలకులకు ఇది తక్షణ కర్తవ్యం కావాలి!..

### కమ్ముకొస్తున్న కరువు



*జులై గడిచిపోయి, ఆగస్టు నెల అంచుల దాకా వచ్చినా, ఇంకా ఎండలు చండప్రచండంగా తమ ప్రతాపాన్ని చూపిస్తూనే వున్నాయి. కొన్ని జిల్లాల్లో అక్కడక్కడా వానలు కురిసినా.. నామమాత్రంగానే వుంటున్నాయి. అదునుకు పదునైన వర్షాలు కురవకపోవడంతో రైతన్నలు కుదేలైపోతున్నారు.*

## 'అంతర్'జాతీయం

- దేశీయ అవసరాలను తీర్చే వినూత్న స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయాలని ఐఐటిలకు రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ సూచించారు. ఇటీవల ఢిల్లీలో ఐఐటి ఛైర్మెన్‌లు, డైరక్టర్లు, గవర్నర్ల ముగింపుసదస్సులో ఆయన మాట్లాడుతూ ఐఐటిలను ఈశాన్య రాష్ట్రాల విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చే ప్రాజెక్ట్‌కు త్వరితగతిన రూపకల్పన చేయాలని సూచించారు.
- ఆర్థిక ఇబ్బందుల వల్లగాని, చిన్నతనంలోనే పనులకు వెళ్లాల్సిన కారణంతో గాని చదువును మధ్యలో ఆపేసినవారు మళ్లీ చదువుకుంటామంటే సహకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా వుందని కేంద్ర మానవవనరులశాఖ మంత్రి స్మృతి ఇరానీ ప్రకటించారు. ఇలాంటి వారు పిహెచ్‌డి స్థాయి వరకు వెళ్లేందుకు వీలుగా ఈ ఏడాది చివరినాటికి ఒక కార్యక్రమాన్ని అందుబాటులోకి తేనున్నట్లు ఆమె వెల్లడించారు.
- పాకిస్థాన్‌తో ఉన్న సరిహద్దు ప్రాంతంలో 50మీటర్ల పొడవైన సొరంగం బయటపడింది. భారత్‌లోకి అక్రమంగా జొరబడేందుకు తీవ్రవాదులే దీనిని నిర్మించి ఉంటారని భావిస్తున్నారు.
- అయోధ్యలో రామాలయాన్ని 2016లోపు పునర్నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని బీజేపీ సీనియర్ నాయకుడు సుబ్రహ్మణ్య స్వామి ప్రధాని నరేంద్ర మోడీని కోరారు. దీనికోసం జస్టిస్ కపాడియా లాంటి మాజీ ప్రధాన న్యాయమూర్తిని సంధానకర్తగా నియమించాలని సూచించారు.
- కోట్లాది రూపాయలు స్వాహా అయిన కామన్‌వెల్త్, కోల్‌గేట్ కుంభకోణాల ఆడిట్ నివేదికల నుండి కొంతమంది పేర్లను తొలగించాలంటూ యూపిఏ ప్రభుత్వంలో నాపై ఒత్తిడి వచ్చిందని నాటి కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ వినోద్‌రాయ్ ప్రకటించి సంచలనం రేపారు. ఢిల్లీలో జరిగిన ఓ పుస్తకావిష్కరణ సభలో ఆయన మాట్లాడుతూ సంకీర్ణభాగస్వాములు ఇందుకోసం ప్రత్యేకంగా కొందరు రాజకీయ నాయకులను తన వద్దకు రాయబారానికి పంపినట్లు వెల్లడించారు.
- భారత ప్రధానన్యాయమూర్తి నియామకం సీనియారిటీ ప్రాతిపదికన కాకుండా ప్రతిభ ఆధారంగా జరగాలని ప్రెస్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఛైర్మెన్ జస్టిస్ మార్కండేయ కట్జూ పేర్కొన్నారు. సీనియర్‌లే ప్రధాన న్యాయమూర్తిని చేయాలన్న నిబంధన ఏదీ లేదని, ప్రతిభావంతులనే ఈ పదవికి ఎంపిక చేయడం సముచితమన్నారు.

## వార్త - వ్యాఖ్య

వార్త :- ఆసుపత్రుల్లో అవినీతికి అడ్డుకట్ట. – కేంద్రమంత్రి హర్షవర్ధన్.
**వ్యాఖ్య :- *ముందు సక్రమంగా చికిత్స చేసే సంగతి ఆలోచించండి.***

వార్త :- జగన్ ప్రతిపక్ష నేతగా పనికిరారు.
– 'దేశం' ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల, కాల్వ.
**వ్యాఖ్య :- *అది చంద్రబాబుకే కరెక్ట్ అంటారా?***

వార్త :- ఏపి పోలీసులకు త్వరలో కొత్త వాహనాలు.
**వ్యాఖ్య :- *పోలీసుల పనితీరు కూడా కొత్తగా ఉంటే ఎంతో బాగుండు.***

వార్త :- బలమైన రాజ్యాంగ విరుద్ధసంస్థగా ఆరెస్సెస్.
– మాయావతి విమర్శ.
**వ్యాఖ్య :- *గత ప్రభుత్వంలో బలమైన రాజ్యాంగ విరుద్ధ వ్యక్తులు వున్నప్పుడు ఏమీ అనలేదే?***

వార్త :- రాజధాని ఏర్పాటుపై అన్ని పార్టీలను సంప్రదించాలి.
– సీపీఎం కార్యదర్శి మధు.
**వ్యాఖ్య :- *పార్టీలంటే చంద్రబాబు రియల్టర్లననుకుంటాడు.***

వార్త :- జగన్ పలికేవన్నీ అసత్యాలే. – చినరాజప్ప.
**వ్యాఖ్య :- *చంద్రబాబు పలికేవన్నీ నిజాలైనట్లు...***

వార్త :- ఇది ప్రజాస్వామ్యమా? నియంతృత్వమా? – వైకాపా ఎమ్మెల్యేలు.
**వ్యాఖ్య :- *ప్రజాస్వామ్యం ముసుగులో నియంతృత్వం.***

వార్త :- ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తే సహించం. – దిగ్విజయ్.
**వ్యాఖ్య :- *ప్రాంతాల మధ్య విభేదాలకు ఓకేనా?***

వార్త :- కాశ్మీర్‌లో జాతీయవాద ప్రభుత్వం అవసరం. – అమిత్‌షా.
**వ్యాఖ్య :- *అంటే బీజేపీ ప్రభుత్వమనేగా...***

వార్త :- తెలంగాణలో రేవంత్ సీఎం. – పయ్యావుల కేశవ్ వ్యాఖ్య.
**వ్యాఖ్య :- *ఎలాగూ కాదనే నమ్మకంతోనే కదా... ఇంత ధైర్యంగా చెప్పారు.***

వార్త :- ఏపి, తెలంగాణలకు పన్ను మినహాయింపునిస్తే మా పరిశ్రమలు తరలిపోతాయి. – ప్రధానికి జయ లేఖ.
**వ్యాఖ్య :- *మీ కోసం ఈ రెండురాష్ట్రాలు ఇలాగే అభివృద్ధికి దూరంగా ఉండాలా!***

# వివేకాది రెండు నాల్కల ధోరణి

## కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి విమర్శ



మాజీ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి రెండు నాల్కల ధోరణితో వ్యవహరిస్తున్నారని, ఎప్పుడు ఏదనిపిస్తే అది మాట్లాడేస్తున్నారని, బహుశా ఆయనకు మతిభ్రమించిందేమోనని అనిపిస్తోందని తెలుగుదేశం పార్టీ నగరశాఖ అధ్యక్షులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి విమర్శించారు.

ఈ నెల 23న ఆయన టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆనం సోదరుల వైఖరిని దుయ్యబట్టారు. గత రెండు దశాబ్దాలుగా ఆనం సోదరులు నెల్లూరు నగరాన్ని దోచుకుతిన్నారని ఆయన విమర్శించారు. ఆనం సోదరులు ప్రజల ఓట్లను, సానుభూతిని కోల్పోయారని అన్నారు. ఆనం వివేకాకు ఈరోజు మాట్లాడిన మాటలు రేపు గుర్తుండడం లేదని ఆయన ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజల కోసం రుణమాఫీ పథకం వర్తింపజేయడానికి కృషి చేస్తుంటే, చంద్ర బాబుపై రోజుకో మాట మాట్లాడుతూ లేనిపోని విమర్శలు చేయడం సముచితం కాదని ఆయన అన్నారు. చంద్రబాబు బాగా పనిచేస్తున్నారని ఒకరోజు, రుణమాఫీ విషయంలో రైతులను దగా చేస్తున్నారని మరొకరోజు ఇలా పరస్పర విరుద్ధమైన ప్రకటనలు చేస్తూ ఆనం వివేకా చిత్తం వచ్చిన రీతిగా వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. ఇకనైనా వివేకా తన తీరు మార్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కిలారి వెంకటస్వామినాయుడు, వైవి సుబ్బారావు, ధర్మవరపు సుబ్బారావు, ఉచ్చి భువనేశ్వరప్రసాద్, మేకల రజని, జలదంకి సుధాకర్, రామ చంద్రారెడ్డి, మల్లి తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శప్రాయుడు టంగుటూరి ప్రకాశంపంతులు



ప్రకాశం పంతులుకు నివాళులర్పిస్తున్న వెంకయ్య నాయుడు, మేయర్ అజీజ్

టంగుటూరి ప్రకాశం పంతులు ఎంతో ఆదర్శప్రాయులని, తెల్లదొరలను ఎదిరించి పోరాడిన ధీశాలని, నేటితరం పాలకులు, యువత టంగుటూరిని ఆదర్శంగా తీసుకోవాలని కేంద్రమంత్రి ముప్పవరపు వెంకయ్యానాయుడు అన్నారు. టంగుటూరి జయంతి సందర్భంగా ఈ నెల 23న ఆయన నెల్లూరులోని ఎసి మార్కెట్ వద్ద వున్న టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకయ్యానాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలోనూ టంగుటూరి ప్రజల సంక్షేమం కోసం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని కొనియాడారు. ఈ సందర్భంగా టంగుటూరితో సాన్నిహిత్యం వున్న ఉల్చి కృష్ణారావును ఆయన ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, నగర మేయర్ అబ్దుల్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకల సందర్భంగా నగరంలోని పలువురు ప్రముఖులు, పార్టీల నాయకులు కూడా టంగుటూరి విగ్రహానికి పూలమాలలు వేసి ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే ముంగమూరు, టిడిపి నాయకులు బీదా రవిచంద్ర, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఉచ్చి భువనేశ్వర ప్రసాద్, రజని, వెల్లంచేటి చంద్రమౌళి, అదే విధంగా మాజీ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఎసి సుబ్బారెడ్డి, ఆనం రంగమయూర్‌రెడ్డి, డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్, బిజెపి నాయకులు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, బ్రాహ్మణసేవా సంఘం తరపున రాళ్లపల్లి రామసుబ్బారావు తదితరులు టంగుటూరి విగ్రహానికి పూలమాలలు వేసి ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. అదే రోజు కస్తూర్బా కళాక్షేత్రంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, జాయింట్ కలెక్టర్ రేఖారాణి, ఎజెసి రాజ్‌కుమార్, నగర మేయర్ అబ్దుల్ అజీజ్ తదితరులు పాల్గొని టంగుటూరికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి.

# చిన్నారులను క్రమశిక్షణతో పెంచాలి

## - ప్రముఖ రచయిత యండమూరి




తల్లిదండ్రులు ఎంతో క్రమశిక్షణతో పిల్లలను పెంచుకోవాలని, పిల్లల భవితకు తల్లిదండ్రులే మార్గదర్శనం చేస్తూ, వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ అన్నారు. ఈ నెల 23న నెల్లూరులోని టౌన్‌హాలులో బచ్‌పన్ పాఠశాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, చిన్నారుల్లోని ప్రతిభను ప్రోత్సహించాలని, వారిలో వున్న సృజనాత్మకశక్తిని గమనించి, వారిని ప్రోత్సహించడం ద్వారా వారి భవితకు బాటలు వేయాలని సూచించారు. ప్రతి చిన్న విషయాన్నీ పిల్లలకు అర్థమయ్యేరీతిలో తల్లిదండ్రులు వివరించాలని, తద్వారా పిల్లలు సమాజంలో గౌరవప్రదంగా జీవిస్తూ, జీవితంలో ఆశించిన లక్ష్యాలను సాధించగలిగేలా వారిని చైతన్యవంతం చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో బచ్‌పన్ స్కూల్ డైరెక్టర్లు శిరీష్, ఆశీర్వాదం, వెంకటేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సీమాంధ్రకు ఎస్పీని కేటాయించడం

# జిల్లా ప్రజల అదృష్టం

కమలనాథన్ కమిటీ మార్గదర్శకాల ఆధారంగా ఇరు రాష్ట్రాల ఉద్యోగుల కేటాయింపుల్లో సీమాంధ్రకు ప్రస్తుత నెల్లూరుజిల్లా ఎస్పీ సెంథిల్‌కుమార్‌ను ఆంధ్రరాష్ట్రానికి కేటాయించడం జిల్లా ప్రజల అదృష్టమని, ఎస్పీ పూర్తికాలం నెల్లూరుజిల్లాలో పనిచేసే విధంగా జిల్లా మంత్రి సహకరించాలని కోరుకుంటున్నట్లు ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా ఇన్‌ఛార్జ్ యనమల నాగేశ్వరరావుయాదవ్, పట్టణ ఇన్‌ఛార్జ్ సోమిశెట్టి సుమన్ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు.

# నెల్లూరు కబుర్లు



## దీపమ్మకు సత్కారం

స్వర్ణభారత్ మేనేజింగ్ ట్రస్టీ ఇమ్మణ్ణి దీపావెంకట్‌ను వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు కలిసి సోమవారం సత్కరించారు. జాతీయ క్రీడలకు నెల్లూరును వేదిక చేయనున్నట్లు స్వర్ణభారత్ ట్రస్ట్ వార్షికోత్సవ వేడుకలలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్రమంత్రి వెంకయ్యనాయుడులు ప్రకటించడం జరిగింది. ఈ మంచి పనికి కారణమైన దీపా వెంకట్‌ను విక్రమసింహపురి విశ్వవిద్యాలయం ఫిజికల్ డైరక్టర్ల సంఘం అధ్యక్షులు ఎం.రవీంద్రబాబు ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌డిఓ యతిరాజ్, క్రీడాసంఘాల ప్రతినిధులు నారాయణరాజు, పసుపులేటి రామ్మూర్తి, విజయకుమార్, ఎం.చంద్రమోహన్, పి.కొండలరావు, కృష్ణప్రసాద్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మట్టి వినాయకుని ప్రతిమల పంపిణీ



విలేకర్ల సమావేశంలో ప్రసంగిస్తున్న మావూరి శ్రీనివాసరావు, పక్కన రాజీ యాడ్స్ పెంచలయ్య

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని, పర్యావరణ పరిరక్షణలో భాగంగా వినాయకుని మట్టి ప్రతిమలను పంపిణీ చేసేందుకు నగరంలోని సిఎంఆర్ షాపింగ్‌మాల్, చందనా బ్రదర్స్‌వారు సమాయత్తమయ్యారు. జిల్లా ప్రజలకు, తమ వినియోగదారులకు మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేయనున్నామని ఆ సంస్థల అధినేత మావూరి శ్రీనివాసరావు తెలియజేశారు. ఈనెల 24న సిఎంఆర్ షాపింగ్‌మాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినాయకచవితి సందర్భంగా జిల్లాలో ఎవరైనా నూతనరీతిలో వినాయకుని ప్రతిమలను రూపొందిస్తే వాటిని సిఎంఆర్ షాపింగ్‌మాల్‌లో ప్రదర్శనకు ఉంచి, పోటీ నిర్వహిస్తామన్నారు. వాటిలో ప్రజలు మెచ్చుకున్న వాటికి బహుమతులు ఇస్తామన్నారు. సిఎంఆర్ షాపింగ్‌మాల్ 6వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 23 నుంచి 28వ తేది వరకు ప్రతి రూ.500ల కొనుగోళ్ళపై ఆకర్షణీయమైన బహుమతులు అందజేస్తామని, బంగారంపై గ్రాముకు నూరు రూపాయల తగ్గింపు వుంటుందని, తక్కువ ధరలకే అధునాతన వస్త్రాలను అందజేస్తామన్నారు.

## అలరించిన 'ఫ్లవర్స్‌డే'



నెల్లూరు సరస్వతినగర్‌లోని డా॥ కిషోర్స్ రత్నం కిడ్స్ ఇంటర్నేషనల్ స్కూలులో 22వ తేదీ నిర్వహించిన 'ఫ్లవర్స్‌డే' కార్యక్రమం అలరించింది. చిన్నారులు సహజమైన ఫ్లవర్స్, ఆర్టిఫిషియల్ ఫ్లవర్స్, గాజుతో తయారు చేసిన ఫ్లవర్స్, ఊలు, బంకమట్టితో తయారుచేసిన ఫ్లవర్స్‌తో పాటు పిల్లలకు అవసరమైన పౌడర్లు, వివిధ కాస్మొటిక్స్ ఐటమ్స్‌ను ఈ సందర్భంగా ప్రదర్శించి అవి ఎలా వాడుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో డా॥ కిషోర్స్‌రత్నం జెన్‌నెక్స్ట్ స్కూల్స్ జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు పాల్గొని మాట్లాడుతూ చిన్నారులకు వివిధ ఫ్లవర్స్ యొక్క పేర్లతో పాటు ఏ రంగు ఎలా వుంటుందో తెలుస్తుందని, ఫ్లవర్స్‌ని వివిధ ఫ్లవర్‌వాజ్‌లుగా తయారుచేసి గృహాల్లో, వివిధ స్థలాల్లో అలంకరించుకోవడం అలవాటు చేసుకోవడం తెలుసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా॥ కిషోర్స్ రత్నం జెన్‌నెక్స్ట్ స్కూల్ సీనియర్ మేనేజర్ రాజేష్‌బాబు, రేస్ ఇంటర్నేషనల్ ప్రిన్సిపల్ రేవతి, రత్నం కిడ్స్ ఇంటర్నేషనల్ ప్రిన్సిపల్ లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మాతృభాషను పరిరక్షించుకోవాలి

**- ప్రముఖ సాహితీవేత్త యార్లగడ్డ లక్ష్మీప్రసాద్**



మెట్టు రామచంద్రప్రసాద్‌ను సత్కరిస్తున్న వీరిశెట్టి హాజరత్‌బాబు, నలుబోలు బలరామయ్యనాయుడు, రాజారామిరెడ్డి, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఎం.ఆదిశేషయ్య, శ్రీలక్ష్మి మోహన్‌రావు, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బి.వి.నరసింహం

ప్రతి ఒక్కరూ మన మాతృభాష ఔన్నత్యాన్ని గుర్తించి, మన భాషను మనం పరిరక్షించుకోవాలని ప్రముఖ సాహితీవేత్త, కేంద్రీయ హిందీ సంస్థాన్ ఉపాధ్యక్షులు డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు.

నెల్లూరులో ఈ నెల 24న ప్రపంచ తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. తెలుగుభాషాభ్యున్నతికి డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి చేసిన సేవలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తుతించారు. నవ్యాంధ్ర నిర్మాణానికి ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు కవులు, రచయితలు మరింతగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా పద్యకళాపరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్‌కు ప్రపంచ తెలుగు సమాఖ్య తరపున సత్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, విఎస్‌యు ఉపకులపతి రాజారామిరెడ్డి, ప్రపంచ తెలుగు సమాఖ్య కార్యదర్శి శ్రీలక్ష్మీ మోహనరావు, మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు ప్రమీలా ఆనంద్, సెక్రటరీ జనరల్ ఆదిశేషయ్య, సాంస్కృతిక విభాగం అధ్యక్షులు పి.వి.సాయి తదితరులు పాల్గొన్నారు. గురుకృపా కళాక్షేత్రం, గురుకృప సంగీత విద్యాలయం చిన్నారులు, ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రపంచ తెలుగు సమాఖ్య ప్రాంతీయ కమిటీ ఛైర్మెన్ నలుబోలు బలరామయ్యనాయుడు, వైస్‌ఛైర్మెన్ వి.హజరత్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బి.వి నరసింహం వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

## మనోళ్లు మనదగ్గరే!





ఐఏఎస్, ఐపిఎస్‌ల విభజనలో మన జిల్లాలో పని చేస్తున్న ఉన్నతాధికారులను ఆంధ్రప్రదేశ్‌కే కేటాయించడం విశేషం. కలెక్టర్ ఎన్.శ్రీకాంత్‌తో పాటు జాయింట్ కలెక్టర్ రేఖారాణి, ఎస్పీ సెంథిల్‌కుమార్‌లు ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించబడ్డారు. ఐపిఎస్‌ల విభజనలో సెంథిల్‌కుమార్ తెలంగాణకు పోతాడని, జిల్లాకు కొత్త ఎస్పీ వస్తాడనే ప్రచారం జరిగింది. కాని ఆయనను ఏపీకే కేటాయించడంతో ఆ ప్రచారానికి తెరపడింది.

## నెల్లూరులో వినాయకచవితి సందడి

**- ఊరూ వాడా భారీగా వేడుకలు**

**- కళకళలాడుతున్న విఘ్నేశ్వరుని ఆలయాలు**



ఈ నెల 29వ తేదీ వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా గణపయ్య వేడుకలు భారీగా జరుగనున్నాయి. అందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. వాడవాడలా, వీధివీధినా ఇంటింటా ఎంతో సంబరంగా ప్రజలందరూ కలసి ఈ పండుగ నిర్వహించుకోవడం ఆన వాయితీ. ముఖ్యంగా యువత ఈ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించుకోవడంలో పోటీ పడుతుంటారు. వీధి వీధినా పెద్దపెద్ద వినాయకుని విగ్రహాలను సర్వాంగ సుందరంగా ఏర్పాటు చేసి, పూజలు, ఉత్సవాలతో సంబరాలు చేస్తుంటారు. కళ్ళు మిరుమిట్లు గొలిపే పెద్ద ఆర్చ్‌లతో, అత్యద్భుతంగా తీర్చిదిద్దిన మండపాలతో, రంగురంగుల వినాయకుని ప్రతిమలతో నగరంలోని వీధులన్నీ కళకళలాడుతున్నాయి.

ఈ పండుగ సందర్భంగా విఘ్నేశ్వరుని ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక అలంకరణలు చేసి, పూజలు నిర్వహిస్తారు. జిల్లాలోని గణనాథుని ఆలయాలన్నీ విద్యుద్దీపాలంకరణలతో శోభాయమానంగా రూపుదిద్దుకున్నాయి. వినాయకచవితి సందర్భంగా ప్రతి ఇల్లూ ఒక కోవెలగా మహిళలు తీర్చిదిద్దుకుని గణనాథునికి ఎంతో భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తారు.

## డిఎస్పీలు ఏఎస్పీలయ్యారు

కావలి డిఎస్పీ బాలవెంకటేశ్వరరావు, ఆత్మకూరు డిఎస్పీ కె.మాల్యాద్రిలకు ఏఎస్పీలుగా పదోన్నతి లభించింది. పదోన్నతి పొందిన బాలవెంకటేశ్వరరావును హైదరాబాద్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి, మాల్యాద్రిని అనంతపురం జిల్లా ఏఎస్పీగా బదిలీ చేశారు.

## సాధనా పాదయాత్ర

నెల్లూరు చిన్నపిల్లల పార్కు పక్కన ఉన్న శ్రీ షిరిడి సాయి సదన్ మందిరం నుండి గొలగమూడి అవదూత శ్రీ వెంకయ్యస్వామి మందిరం వరకు ఈ నెల 23వ తేదీ మధ్యాహ్నం సకలజన శ్రేయస్సు కోసం శ్రీ స్వామి వివేకానంద స్ఫూర్తితో పాదయాత్ర నిర్వహించినట్లు సన్నిధి పబ్లికేషన్స్ అధినేత అల్లు భాస్కరరెడ్డి తెలిపారు.

ఈ పాదయాత్ర ముత్తుకూరు గేటు వద్దనున్న ఆనం వెంకటరెడ్డి సెంటర్ నుండి మినీబైపాస్ రోడ్డులోని బెజవాడ గోపాలరెడ్డి సెంటర్, అన్నమయ్య సర్కిల్ చేరుకుని అక్కడనుండి ఇస్కాన్ మందిరం మీదుగా కొండాయపాళెం గేటు మీదుగా గొలగమూడిరోడ్డు వరకు సాగిందని తెలిపారు.

## ముసవ్వీర్ మరో అద్భుత సృష్టి



వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని నెల్లూరు జెండా వీధికి చెందిన సూక్ష్మ స్వర్ణకారుడు షేక్ ముసవ్వీర్ స్వర్ణపనిముట్లతో ఆశీనులైన స్వర్ణకార కార్మిక మహాగణపతి నమూనాను అత్యద్భుతంగా రూపొందించి అందరి ప్రశంసలూ అందుకుంటున్నారు. 3 గ్రాములు, 200మి.లీ వెండితో ఈ అద్భుతమైన గణపతి ప్రతిమను ఆయన రూపొందించారు. ఇందులో గణపతితో పాటు మేజ, సుత్తి, పట్టెడ, పట్టకారు, కత్తెర, శ్రావణం, స్వర్ణకారులు వినియోగించే కుంపటి, బ్లోయర్ అందుకు తగిన పరికరం, నీళ్ళ కర్ర, నీటి మూకుడు, స్వామివారి చేతిలో త్రాసు, రంపం, స్వామివారి వాహనమైన మూషికం తదితరాలన్నిటినీ పొందుపరిచారు.

## మళ్లీ డిఆర్‌ఓగా రామిరెడ్డి?

జిల్లా రెవెన్యూ అధికారిగా బి.రామిరెడ్డి తిరిగి రానున్నట్లు తెలుస్తోంది. మరో వారంలోపే ఆయన బాధ్యతలు చేపట్టే అవకాశాలున్నాయి. ప్రస్తుతం ఆయన టీటీడీలో డిప్యూటీ ఇఓగా వున్నారు. ఎన్నికలకు ముందు నెల్లూరు నుండి ఆయనను బదిలీ చేశారు. ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం కూడా వచ్చింది. రామిరెడ్డి తిరిగి అదే పోస్ట్‌లోకి రానున్నారు.

## రాధ మాధవ్ గోపికలకు

# ఇక సెలవు

### సెప్టెంబర్1 నుండి సినీ ప్రేక్షకులకు దూరం



రాధ మాధవ్ నెల్లూరు జిల్లా సినీ ప్రియులకు ఇవి అత్యంత ఇష్టమైన పేర్లు. 1975లో డేగా రాంగోపాల్‌రెడ్డి జిల్లాకి అందించిన అరుదైన సినిమా హాళ్ళు రాధ మాధవ్. మొట్టమొదట సారిగా ఒకే ప్రాంగణంలో రెండు థియేటర్లు నిర్మించడంతో అప్పట్లో అదో పెద్ద సంచలనం. మాగుంట వాళ్ళ మూడు హాళ్ళు వచ్చే వరకు ఈ రాధ మాధవ్‌కు ప్రత్యేక గుర్తింపు ఉండేది. 1993లో రాధ మాధవ్‌లకు తోడు గోపిక కూడా రాంగోపాల్‌రెడ్డి నిర్మించారు. 1975లో అక్కినేని నాగేశ్వరరావు స్వహస్తాలతో ఈ థియేటర్లను ప్రారంభించారు. అప్పట్లోనే అధునాతన ఇంజనీరింగ్ నైపుణ్యంతో నిర్మించిన ఈ సినిమా హాళ్ళను అక్కినేని అమితంగా పొగిడి వీటి యజమాని డేగా రాంగోపాల్‌రెడ్డిని ఆయన సతీమణి శ్రీమతి దొరసానమ్మలను అభినందనలతో ముంచెత్తారు. రాంగోపాల్‌రెడ్డి దంపతులిద్దరు తమ స్వంత ఇంటిని కట్టుకున్నంత ఇష్టంగా ఈ సినిమాహాళ్ళను ప్రతి అంగుళం తామే ప్రత్యేకంగా పర్యవేక్షించి నిర్మించుకున్నారు. 1975లో బెజవాడ గోపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ వేడుకలో అక్కినేని పాల్గొని రాధ మాధవ్ సముదాయన్ని ఆవిష్కరించారు.

రాధ మాధవ్‌లకు తోడుగా 1993 ఏప్రియల్28వ తేదీన గోపిక థియేటర్‌ను నిర్మించి బెజవాడ గోపాల్‌రెడ్డి చేతుల మీదుగా నెల్లూరుజిల్లా సినీప్రియులకు అంకితం ఇచ్చారు రాంగోపాల్‌రెడ్డి దొరసానమ్మ దంపతులు. సెప్టెంబర్ 1, 2014 నుండి ఈ సినిమా హాళ్ళు సినీ ప్రేక్షకులకు దూరం కాబోతున్నాయి. శరవేగంగా పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం ఈ నాలుగు దశబ్దాల కాలంలో జరిగిన విప్లవాత్మక మార్పుల కారణంగా నేటి సినిమాలయాలన్ని అధునాతన హంగులతో ప్రేక్షకుల మనసులు దోచుకుంటున్న తరుణంలో పాత వాసన తొలగించే ధ్యేయంతో యాజమాన్యం నిర్ణయం తీసుకొని రాధ, మాధవ్, గోపికలను పూర్తిగా తొలగించడానికి సన్నాహాలు చేసుకుంటున్నారు.

నేటి తరానికి అవసరమైన రీతిలో మల్టీప్లెక్స్ నిర్మాణానికి ఎవరైనా ముందుకు వస్తే వారి ఆధ్వర్యంలో ఈ ప్రాంగణాన్ని కొత్త అందాలతో తీర్చి దిద్దే అవకాశాలు ఉన్నాయి. లేని పక్షంలో అధునాతన వ్యాపార కేంద్రంగా ఈ థియేటర్లు రూపాంతరం చెందవచ్చని సమాచారం.

ఏది ఏమైనా సుమారు40 సంవత్సరాల పాటు సినీ ప్రేక్షకుల మనసులు దోచుకున్న రాధ, మాధవ్‌లు తోపాటు గోపిక కూడా అందరికి దూరం కాబోతుండటం బాధాకరం.

## • స్వర్ణభారత్ ట్రస్ట్‌లో

# వైభవంగా వరుణయాగం

- పులకించి, కరుణించిన వరుణుడు
- స్ఫూర్తిదాయకంగా ముఖ్యమంత్రి, కేంద్రమంత్రి పర్యటన



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు, కేంద్రమంత్రి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఈ నెల 24న వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌కు విచ్చేసిన సందర్భంగా నేతలు చేపట్టిన పలు కార్యక్రమాలు, చేసిన ప్రసంగాలు అందరిలోనూ స్ఫూర్తిని కలిగించాయి. వెంకయ్యనాయుడు ఆహ్వానం మేరకు సిఎం ఇక్కడికి విచ్చేసి స్వర్ణభారత్ ట్రస్ట్ చేపట్టిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా శాంతి యాగం, వరుణయాగం నిర్వహించారు. ఎంతో వేడుకగా శ్రీనివాస కల్యాణం నిర్వహించారు. ఈ యాగాలు నిర్వహించిన కొద్దిసేపటికే వర్షం కురవడం విశేషం. దీంతో అందరూ సంతోషించారు. పెద్ద పెట్టున గోవిందా అంటూ గోవిందనామాలు జపించారు. ఇదంతా ఆ దేవదేవుని మహిమేనని, గతంలో కూడా ఇక్కడ వరుణయాగం నిర్వహించినప్పుడు వర్షం కురిసిందని ట్రస్ట్ నిర్వాహకురాలు దీపా వెంకట్ తెలిపారు. వరుణయాగం నిర్వహించిన వెంటనే వర్షం కురవడం శుభసూచకమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఇదిలావుంటే, ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ ప్రతిఒక్కరికీ నమ్మకం అనేది ముఖ్యమని, ఆ నమ్మకమే విజయాలకు బాటలు వేస్తుందని అన్నారు. పుట్టిన వూరిని మరిచిపోకుండా, జన్మభూమికి సేవ చేసేందుకు ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్న వెంకయ్యనాయుడు సేవలు ఎంతో అభినందనీయమన్నారు. స్వర్ణభారత్ ట్రస్ట్ సేవలను ప్రస్తుతించారు. ప్రత్యేకించి ప్రజలకు సేవచేయాలనే ఉద్దేశంతో కేంద్ర మంత్రి వెంకయ్యనాయుడు, ఆయన కుమార్తె దీపా వెంకట్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అందరికీ మార్గదర్శకమంటూ కొనియాడారు. ఇలాంటి ట్రస్ట్‌లు జిల్లాకు ఒకటి వున్నా ఎంతో అభివృద్ధి జరుగుతుందని ప్రశంసించారు. క్రీడలకు నెల్లూరు పెట్టిందిపేరని, ఇక్కడ జాతీయస్థాయిలో సైతం క్రీడలు జరిగేవిధంగా తగు కృషి చేస్తామన్నారు. కొంతమంది స్వార్ధపరులు అడ్డదారుల్లో ధనార్జన చేయాలని భావిస్తుంటారని, అయినా పోయేటప్పుడు ఎవరూ ఏమీ తీసుకుపోయేది వుండదని గుర్తుంచుకోవాలని అన్నారు. వెంకయ్యనాయుడు మాట్లాడుతూ, ఇదంతా తన గొప్పతనమేమీ కాదని, ఈ ట్రస్ట్‌తో తనకేమీ సంబంధం లేదని, కొందరు మిత్రులంతా కలసి ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ఈ ట్రస్ట్ ఏర్పాటు చేసుకున్నారని, ట్రస్ట్‌ను తన కుమార్తె కంటికి రెప్పలా కాపాడుకుంటోందని, ఈ ఘనతంతా ఆమెదేనని అన్నారు. ప్రజలకు స్ఫూర్తిని కలిగించేందుకు, సేవా భావాన్ని ప్రోత్సహించేందుకు తన వంతుగా పలు రంగాల్లో వున్న ప్రముఖులను ఇక్కడికి ఆహ్వానిస్తున్నామని, వారి ద్వారా మరింత స్ఫూర్తి, సేవాభావం అందరిలో కలుగుతుందని, అది మంచి పరిణామమని అన్నారు. తాను నెల్లూరులో జన్మించినందుకు గర్వపడుతున్నానని, నెల్లూరీయునిగా, తెలుగువానిగా, భారతీయునిగా వుండడం తనకెంతో గర్వకారణమన్నారు. నెల్లూరు చెరువును అభివృద్ధి చేసేందుకు, మైపాడు, పులికాట్, నేలపట్టు ప్రాంతాలకు మరింత పర్యాటక కళ వచ్చేందుకు కృషి చేస్తామని వెంకయ్యనాయుడు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో స్వర్ణ భారత్ ట్రస్ట్ ఛైర్మెన్ మాగుంట రాజేంద్ర ప్రసాద్, మేనేజింగ్ ట్రస్టీ దీపావెంకట్, మంత్రులు పి. నారాయణ, కె.శ్రీనివాస్, జివికె గ్రూప్ ఛైర్మెన్ జి.వి.కె.రెడ్డి, గ్రంథి మల్లికార్జునరావు, ఎమ్మెల్యేలు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, బొల్లినేని రామారావు, కురుగొండ్ల రామకృష్ణ, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, టిడిపి నాయకులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆదాల ప్రభాకరరెడ్డి, బీద రవిచంద్ర, ముంగమూరు శ్రీధరకృష్ణా రెడ్డిలతో పాటు ప్రముఖ దర్శకులు రాఘవేంద్రరావు, ఎపిఐఐసి ఛైర్మెన్ పి. కృష్ణయ్య, జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, ఎస్పీ సెంథిల్‌కుమార్ తదితర ప్రముఖులంతా పాల్గొన్నారు.

# కన్నులపండువగా వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు

### వెల్లువగా తరలివచ్చిన భక్తులు

వెంకటాచలం మండలంలోని గొలగమూడిలో వెలసివున్న భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆలయంలో స్వామివారి 32వ ఆరాధనా మహోత్సవాలు ఆదివారంతో వైభవంగా ముగిశాయి. ఈ ఉత్సవాలకు జిల్లావ్యాప్తంగానే కాక, తమిళనాడు, కర్నాటక తదితర రాష్ట్రాల నుంచి సైతం పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఎటుచూసినా వెల్లువెత్తిన భక్తజనసందోహంతో ఆలయ ప్రాంగణం క్రిక్కిరిసిపోయింది. లక్షలాదిమంది భక్తులు స్వామివారి ఆరాధనోత్సవాలకు విచ్చేసి, ఆలయంలో కొలువైవున్న భగవాన్ శ్రీ వెంకయ్యస్వామిని దర్శించుకుని తరించారు. ఈ సందర్భంగా ఓం నారాయణ.. ఆదినారాయణ నామజపంతో, వెంకయ్యస్వామి నామస్మరణలతో గొలగమూడి మారుమ్రోగింది. ఆదివారం ఉదయం సర్వేపల్లి శాసనసభ్యులు కాకాణి గోవర్ధన్ రెడ్డి దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలను బహుకరించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి బాలసుబ్రహ్మణ్యం కాకాణిని శాలువతో సత్కరించి, కాకాణి దంపతులకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం స్వామివారికి అంగరంగవైభవంగా రథోత్సవం జరిగింది. ఆ తర్వాత రాత్రికి బాణసంచా వేడుకలతో, విద్యుద్దీపాలంకరణలతో అత్యంత శోభాయమానంగా తెప్పోత్సవం నిర్వహించారు. స్వామివారి ఆరాధనా మహోత్సవాల సందర్భంగా ఆలయ కమిటీవారు లక్షలాదిగా తరలివచ్చిన భక్తులకు స్వామివారి దర్శనం కోసం భారీ ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు భక్తుల రద్దీని క్రమబద్ధం చేశారు. ఉచిత దర్శనంతో పాటు, రూ. 50ల ప్రత్యేక దర్శనం కూడా ఏర్పాటు చేశారు. మంచినీటి వసతి తదితర సదుపాయాలను కలుగజేశారు. రూరల్ సిఐ బిటి నాయక్ ఆధ్వర్యంలో భారీ పోలీసు



స్వామివారి గ్రామోత్సవం

బందోబస్తు ఏర్పాటుచేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. ఆర్టీసీవారు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. ఆలయ అర్చకులు స్వామివారిని వివిధ రకాల పుష్పమాలికలతో అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో స్వామివారికి వాహన సేవలను కన్నుల పండువగా నిర్వహించారు.

# నెల్లూరులో నిర్భయ సెంటర్

అన్యాయానికి గురైన మహిళలు, యువతుల రక్షణ కోసం నెల్లూరుకు 'నిర్భయ సెంటర్' మంజూరైంది. ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో ఆసుపత్రి, మెడికల్ కళాశాలలకు అనుసంధానంగా ఈ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో ఈ సెంటర్ రూపుదిద్దుకోనుంది. అన్యాయానికి గురైన బాధితురాళ్లకు సత్వరం న్యాయం చేకూర్చే లక్ష్యంతోనే దేశవ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో నిర్భయ సెంటర్‌లను ఏర్పాటు చేస్తున్నారు. మన రాష్ట్రంలో తిరుపతి, నెల్లూరు, విజయనగరం వంటి నగరాలకు వీటిని మంజూరు చేసారు. వరకట్న వేధింపులు లేదా లైంగిక వేధింపులకు గురైన బాధితురాళ్లు నేరుగా ఈ సెంటర్‌కు రావచ్చు. ఇక్కడే వైద్యులు, సంబంధిత పోలీసు అధికారి ఉంటారు. వారికి సత్వరం వైద్య సేవలందించడంతో పాటు వసతి, రక్షణ కల్పిస్తారు. సదరు బాధితురాలు పోలీసుస్టేషన్‌కు వెళ్లే అవసరం లేకుండా ఇక్కడే కేసు నమోదు చేసుకుంటారు. బాధితురాలు కోర్టుకు వెళ్లే పని కూడా లేకుండా న్యాయమూర్తి వీడియో కాన్ఫరెన్స్ ద్వారానే ఆమెను విచారిస్తారు. ఆమె ఇచ్చే సమాచారంతోనే నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశపెడతారు.

ఈ పద్ధతి అమలులోకి వస్తే ఎక్కువమంది బాధితులు తమకు జరుగుతున్న అన్యాయాన్ని ధైర్యంగా చెప్పుకోగలరు. 'నిర్భయ సెంటర్' అందుబాటులోకి వస్తే మహిళలపై అకృత్యాలకు కొంతవరకు కళ్లెం వేయవచ్చు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



గల్పిక

# చంద్రబాబు రాకతో వెంకన్నస్వామి పరార్

అది దేశ రాజధాని ఢిల్లీ నగరం. కేంద్ర పట్ట ణాభివృద్ధి శాఖ మంత్రి యం.వెంకయ్యనాయుడు అప్పుడే పని ముగించుకుని ఇంటికి చేరుకున్నాడు. స్నానం చేసి టిఫిన్ తిన్నాక బెడ్ మీద పడుకుని రిలాక్స్ అవుదామని చెప్పి చిన్నప్పుడు తన మేనమామ కొనిచ్చిన టేప్‌రికార్డర్‌లో పాత పాటల క్యాసెట్ పెట్టాడు. తొలిపాట... 'నా జన్మభూమి.. భూమి... భూమి... నా జన్మభూమి ఎంతో అందమైన దేశము... నా ఇల్లు అందులోన కమ్మని ప్రదేశము...' అనే పాట రాగా వెంకయ్య తన్మయం చెందుతూ విన్నాడు. ఆ పాట వినడంతోటే ఆయనకు నెల్లూరు మీద గాలి మళ్లింది. మాటి మాటికి నెల్లూరు వెళితే ప్రధాని నరేంద్ర మోడీ ఏమన్నా అనుకుంటాడేమో ననుకున్నాడు. కాని అప్పుడే స్వర్ణభారత్ ట్రస్ట్ వార్షికోత్సవం సందర్భంగా వెంకటాచలంలో తన కూతురు దీపా వెంకట్ శ్రీవారి వరుణయాగాన్ని తలపెట్టిన విషయం గుర్తుకొచ్చింది. స్వామి పేరు చెబితే నరేంద్ర మోడీ ఇంకేమీ అనకుండా అనుమతి నిస్తాడనుకున్నాడు. ఆ విధంగా అనుమతి తెచ్చుకుని ఢిల్లీ నుండి రేణిగుంటకు విమానంలో బయల్దేరాడు.

వెంకయ్య రేణిగుంటలో విమానం దిగి తన కోసం సిద్ధంగా ఉంచిన కారెక్కాడు. ఆయనతో పాటు ఓఎస్‌డి సత్య కూడా ఉన్నాడు. వెంకయ్య కాన్వాయ్ బయలుదేరింది. ఏర్పేడు సమీపంలోకి వచ్చాక... వెనుక నుండి 'వెంకయ్యా...' అనే పిలుపు వినిపించింది. వెంకయ్య వెనక్కి తిరిగి చూసాడు. అంతే ఆయన కళ్లు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి. నోరు అలాగే తెరచుకుపోయింది. కారణం, అక్కడ వెనుక సీట్లో కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామి ఉన్నాడు. వెంకయ్య తేరుకోవడానికి ఓ ఐదు నిముషాలు పట్టింది. వెంకయ్య ఈ లోకానికి వచ్చి... ఏంటి స్వామి, మీరేంటి, నాకు ఇలా ప్రత్యక్ష కావడమేంటి అని అడిగాడు. అందుకు శ్రీనివాసుడు... ఎప్పుడూ రొటీన్ లైఫ్ అయ్యింది వెంకయ్యా... నిద్ర కూడా కరువవుతుంది. రోజూ అవే సుప్రభాత సేవలు, ఊంజల్ సేవలు, కల్యాణాలు... వెరైటీ అనేదే లేదు. అందుకే కొంచెం రిలీఫ్‌గా ఉంటుందని ఈరోజు నీతోపాటు స్వర్ణభారత్ ట్రస్ట్‌కు వస్తున్నా అని చెప్పాడు. మీరు వచ్చే సంగతి ముందుగానే చెప్పి వుంటే మీకు స్వాగతం పలుకుతూ ఫ్లెక్సీ కటౌట్‌లు కట్టించే వాడిని కదా స్వామీ... అని వెంకయ్య అన్నాడు. వెంకయ్యకు కనపడుతున్న వేంకటేశ్వరస్వామి సత్యకు కన పడడం లేదు. దాంతో తన బాస్ తనలో తానే మాట్లాడుకుంటున్నాడని సత్య ఆందోళన చెందాడు. అయినా ఆ విషయాన్ని ఆయనతో చెప్పే ధైర్యం చేయలేక మౌనం దాల్చాడు. వెంకయ్య మాటలకు బాలాజీ వుండి... నాకు పబ్లిసిటీ ఎందుకు నాయనా... ప్రతి ఒక్కరి హృదయంలో నేనెప్పుడూ వుంటాను. మళ్లీ నాకు ఆహ్వానమెందుకు. అయినా ఈ రొటీన్ మాటలెందుకు గాని, ఇంతకీ వరుణయాగం ఎందుకు చేస్తున్నట్లు? అని అడిగాడు. వెంకయ్య ఆశ్చర్యంగా... అదేంటి స్వామి, అలా అడుగుతారు. శాంతియాగం చేసేది శాంతి కోసం, అలాగే వరుణయాగం చేసేది వర్షాల కోసం అని చెప్పాడు. అప్పుడు శ్రీవారు... నా డౌట్ అది కాదులే, వరుణయాగం చేస్తూ సీఎం చంద్రబాబును ముఖ్య అతిథిగా ఆహ్వానించి ఉంటే... అని సందేహంగా చెప్పాడు. మీ సందేహమేంటి స్వామి, వరుణయాగానికి చంద్రబాబు వస్తే తప్పేముంది అని అడిగాడు. తప్పేం లేదు. కాని వరుణదేవుడికి, చంద్రబాబుకు పడదు కదా. వీళ్లిద్దరికీ మధ్య పూర్వజన్మ శత్రుత్వమేదో ఉంది. కాబట్టే చంద్రబాబు ఉన్న చోటుకు వరుణ దేవుడు రావడం లేదు అని చెప్పాడు వేంకటేశ్వరుడు. అందుకేగా స్వామి వరుణయాగం చేసేది, ఈ యాగంలో మా పూజలు చూసైనా వరుణ దేవుడు మాపై పెట్టుకున్న కోపతాపాలను వీడుతాడనేదే మా ప్రయత్నం అని వెంకయ్య చెప్పాడు. వీళ్లు ఇలా మాట్లాడుకుంటున్నప్పుడే సత్య తన ఫోన్‌లో నుండి ఎవరికో ఫోన్ చేసి అలర్ట్‌గా ఉండమని చెప్పాడు. ఇంతకూ ఏపిలో చంద్రబాబు పాలన ఎలా వుందని శ్రీవారు అడిగారు. ఏదైనా మీకే తెలియాలి స్వామి అని వెంకయ్య అన్నాడు. దానికి స్వామి... నాకు తెలిసినంతవరకు అతని పరిస్థితి... ఎల్‌కెజి కుర్రాడికి ఎంసెట్ ప్రశ్నాపత్రం ఇచ్చి పరీక్ష వ్రాయమన్నట్లుంది. అతని మాటలు, ప్రకటనలు చూస్తుంటే ఏపి కంటే తెలంగాణకు సీఎం అయ్యుంటే బాగుండన్నట్లుంది. పాపం, ఆయనను తెలంగాణ సీఎంను చేసే మార్గమే దన్నా ఉంటే చూడకూడదు అని సలహా ఇచ్చాడు. ఆ మాత్రం తెలివి తేటలే వుంటే చంద్రబాబుకు ఆ అవకాశం ఎందుకిస్తాం స్వామి అని వెంకయ్య చెప్పాడు. ఋణమాఫీ చేస్తానని ఆంధ్రా రైతులకు చెప్పి ఉన్నాడు. చంద్రబాబు ఇంతవరకు దాని గురించి పట్టించుకోలేదు. ఇంతకీ ఏం చేయబోతున్నాడని స్వామి అడిగాడు. ఎలాగూ ఆయన కూడా యాగం వద్దకు వస్తున్నాడు కదా స్వామి, ఈ విషయం ఆయనను నేనే అడుగుతాను, మీరే స్వయంగా విందురు, రండి అని చెప్పాడు. ఈలోపు వారి కాన్వాయ్ స్వర్ణభారత్ ట్రస్ట్ వద్దకు చేరుకుంది. వెంకయ్య కారు దిగగానే నలుగురు డాక్టర్లు, వారితో పాటు దీపా వెంకట్, బీజేపీ నాయకులు చుట్టుముట్టారు. వారందరినీ చూసి వెంకయ్య ఆదుర్దాగా... ఏంటి, ఇంతమంది డాక్టర్లొచ్చారు, ఎందుకు అని అడిగాడు. కారులో అంతా మీలో మీరు మాట్లాడుకుంటున్నారటగా, మీకేదో అయ్యిందని సత్య ఫోన్ చేశాడు. అందుకే డాక్టర్లను పిలిపించాను అని దీపా వెంకట్ అంది. అది విని వెంకయ్య... నాలో నేను మాట్లాడుకోలేదు. వెంకటేశ్వరస్వామితో మాట్లాడుతున్నానంతే... అని చెప్పాడు. ఆ మాట వినగానే ఆయన భార్య ఉషమ్మ ఇంకాస్త ఆందోళనతో... అయ్యో ఈయనకు ఏదో అయ్యింది. అని బాధపడసాగింది. వెంకయ్యకు వారి పరిస్థితి అర్థమై, నాకేమీ కాలేదు, మీరు ఆందోళన చెందవద్దని చెప్పి అక్కడే దూరంగా కూర్చుని వున్న హైటెక్‌రత్న చంద్రబాబు వద్దకు వెళ్లాడు. ఆయన పక్కనే వెంకటేశ్వరస్వామి ఉన్నాడు. కాని ఆయన చంద్రబాబుకు కనిపించడం లేదు. వెంకయ్య వుండి... బాబు గారు, ఋణమాఫీ ఎలా అమలు చేద్దామనుకుంటున్నారు అని అడిగాడు. అందుకు చంద్రబాబు... ఏముంది, అన్ని మార్గాలు ప్రయత్నించాను, ఏ మార్గం సక్సెస్ కాలేదు. ఇక ఏ దారీ లేని వాడికి ఆ దేవుడే దిక్కు అంటారు. నా ఋణ మాఫీకి ఆ వేంకటేశ్వరుడే దిక్కు... నాకు ఆయనే మార్గం చూపించాలన్నాడు. ఆ మాటతో వేంకటేశ్వరస్వామి... ఋణమాఫీ కోసం చివరకు ఇతను నాకు కూడా ఎసరు పెట్టేట్లున్నాడని భయపడి అక్కడ నుండి అదృశ్యమయ్యాడు.

కదంబం

## నాలోకి నేను నడుస్తాను

**అడిగోపుల వెంకటరత్నమ్**
తిరుపతి. 9848252946

నన్ను నేను చూసుకుంటాను
నీడను కొలుచుకుంటాను
రంగులన్నీ తెలుపుగా రూపాంతరం
శబ్దాలు నిశ్శబ్దాలై
పరుగులు నడకలై
తప్పొప్పుల పట్టిక తయారౌతుంది
ఫలితం వడకట్టబడుతుంది
జ్ఞాపకాల దొంతరులు
వలయాన్ని ఛేధించి
భూమ్యాకర్షణలోంచి బైటపడతాయి
ఒకానొక తపస్సు
జ్ఞాన బిక్ష ఔతుంది
జనన మరణాలు
గుండెలో ఒక చోట
బొమ్మ – బొరుసు
క్రీడలు
ఒకటి ఓడిపోతూ
ఒకటి గెలుస్తూ –
ప్రాణాన్ని వెంటేసుకుని
పట్టికలో పేరు నమోదు చేసుకుని
కొత్త కొత్త ఆశలతో నేను –
మంచీ చెడూ
సమాంతరంగా అధిష్టించి
బారులు తీరి ఎదురుచూపులు
సాఫల్యంతో పాదం మోపి
సమస్త క్షేమం కోరుతూ నేను
ఆవేశం సహనం
ముఖాలపై నర్తిల్లి
రంగులు మారుతూ
సహనాన్ని భుజాన వేసుకుని
పథం మార్చుతూ నేను –
ద్వేషం దయ
జోడు గుర్రాల స్వారీ
నేపథ్యంలో
కరుణను చేబట్టి
ఇంటింటా కళ్ళాపి జల్లుతూ నేను –
నాలోకి నేను నడుస్తాను
అందరి ఆనందం నాది!

## అనంతపురంలో 'మోపూరు'కు సత్కారం



అనంతపురంలోని జాయిన్ హ్యాండ్స్ హెల్పింగ్ సొసైటీ ప్రతి ఏడాది వివిధ రంగాల్లో కృషి చేసిన వారికి అందించే పురస్కారానికి ఈ సంవత్సరం సాహిత్య రంగంలో నెల్లూరుకు చెందిన కవి మోపూరు పెంచలనరసింహంను ఎంపికచేసి ఈ నెల 24న అనంతపురంలోని కళావేదికలో సత్కరించింది. ఈ సందర్భంగా నేత్రదానంపై మోపూరు పెంచలనరసింహం రచించిన వెలుగుపూలు కవితా సంపుటి సీడీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో అనంతపురానికి చెందిన ప్రసిద్ధకవి రాధేయ, కేరే జగదీష్, జడ్పీ ఛైర్మెన్ చమన్, నగర మేయర్ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా మురళీకృష్ణుని బ్రహ్మోత్సవాలు

నెల్లూరు రాజేంద్రనగర్‌లోని మురళీకృష్ణ మందిరంలో ఈ నెల 24న కృష్ణాష్టమి సందర్భంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. శ్రీకృష్ణుడు గజేంద్రమోక్ష అలంకారంలో భక్తులకు దర్శనమివ్వగా, నెల్లూరునగర శాసనసభ్యులు డాక్టర్ పోలుబోయిన అనిల్‌కుమార్‌యాదవ్ స్వామిని దర్శించి శాస్త్రోక్తంగా భక్తి ప్రపత్తులతో జరిగిన పూజలలో పాల్గొన్నారు. సాయంత్రం దుండిగం గ్రామానికి చెందిన కీర్తి శీనయ్యదాసు బృందం ఆధ్వర్యంలో పండరిభజనలు, కోలాటాలు, కృష్ణలీలలను ప్రదర్శించారు. కార్పొరేటర్ రవి, నేతలు వందవాసి రంగయ్య, కుంచాల శ్రీనివాసులు, శివపురం సురేష్, దువ్వూరు శైలేంద్ర, లాలాపేట సుధీర్, దేవస్థాన కమిటీ సభ్యులు రూరిసింగ్, సామంతు ప్రసాద్‌రెడ్డి, గుడి సుబ్రహ్మణ్యంరెడ్డి, మోహనఆచారి, అలిమేలు శ్రీనివాసులు ఆచారి తదితరులు పాల్గొన్నారు.

## 30న కవికోకిల దువ్వూరు జయంతి సభ

కవికోకిల బిరుదాంకితుడు, విఖ్యాత సాహితీవేత్త దువ్వూరు రామిరెడ్డి 118వ జయంతి సభ నగరంలోని రావుబహదూర్ రేబాల లక్ష్మీనరసారెడ్డి పురమందిరంలో ఈ నెల 30వ తేది సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్నారు. నెల్లూరులోని దువ్వూరు రామిరెడ్డి విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో జరిగే ఈ సభకు సుప్రసిద్ధ న్యాయవాది, దువ్వూరు రామిరెడ్డి విజ్ఞానసమితి అధ్యక్షులు పివి రమణారెడ్డి అధ్యక్షత వహిస్తారు. విక్రమసింహపురి విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె. నాగేంద్రప్రసాద్ విశిష్ట అతిథులుగా పాల్గొంటారు. కవి పండితుడు, ప్రకాశం జిల్లా ఇంకొల్లు విశ్రాంత ఆంధ్రోపన్యాసకులు బీరం సుందరరావు పాల్గొని 'కవికోకిల కవితా వైభవం' అనే అంశంపై ప్రసంగించి విజ్ఞానసమితి సమ్మానం స్వీకరిస్తారు. ఈ సందర్భంగా తొలుత ప్రముఖ శాస్త్రీయ సంగీత విద్వాంసురాలు శ్రీమతి జె.బాలార్క శిష్యబృందం భక్తిగీతాలాపన వుంటుందని, సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని దువ్వూరు రామిరెడ్డి విజ్ఞాన సమితి అధ్యక్ష కార్యదర్శులు పివి రమణారెడ్డి, బివి నరసింహం, కోశాధికారి జెవిరెడ్డి, సభ్యులు గునుపాటి ఆదిశేషారెడ్డి, మేనకూరు శ్రీనివాసులురెడ్డి, అవనిగడ్డ వేంకటకృష్ణమూర్తి, అగస్త్యరెడ్డి వెంకురెడ్డి కోరారు.

## మానవత్వమే.. సాయితత్వం!

నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని పిచ్చిరెడ్డి కల్యాణ మండపంలో షిరిడీ సాయి భక్త ప్రచారసమితి ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి జరుగుతున్న షిరిడీసాయి భక్త సమ్మేళనంలో స్వామి శ్రీసాయి చైతన్య, షిరిడీ సాయిబాబా సంస్థాన్ ట్రస్టీ డాక్టర్ ఏక్‌నాథ్ గోండ్‌కర్‌లు పాల్గొని సాయిబాబా మానవతా దృక్పథాన్ని, మహిమలను వివరించారు. "శ్రీసాయి బోధనలు – ప్రాధాన్యం – ప్రయోజనాలు" అనే అంశంపై జరిగిన చర్చా కార్యక్రమంలో శ్రీశైలం నుంచి సాయిదాస్, ఉప్పాడ నుంచి కైలాసరావు, నెల్లూరు నుంచి అల్లు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తదుపరి ధ్యానంపై శిక్షణ, విష్ణు సహస్రనామ కీర్తన, రాజమండ్రి భక్త బృందం, నెల్లూరులోని చిల్డ్రన్స్ పార్కు శ్రీ సాయిసదన్ భక్త బృందంతో భజనలు జరిగాయి. సాయంత్రం సాయిబాబా మహిళా సేవాసమాజ్(మార్కాపురం) భక్త బృందంచే కోలాట ప్రదర్శన, సురేష్‌గోపి నృత్య ప్రదర్శనలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్నిచ్చాయి. అలాగే షిరిడీసాయినాథుని సచ్చరిత్రపై క్విజ్ నిర్వహించి, సాయి మహిమలను తెలియజేసే చిన్న నాటికను సాయి విశ్వచైతన్య నిర్వహణలో చిత్రనటుడు చిట్టిబాబు తదితరులు ప్రదర్శించారు. వదాన్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వితరణతో అన్న ప్రసాదాలు పంపిణీ జరిగింది.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

శుభకార్యాలలో పాల్గొనడం, దూరప్రయాణాలుండటం, బంధువర్గంతో సఖ్యత బాగుంటుంది. అనుకున్న పనులు జరగడానికి పట్టుదల, రహస్యంగా ప్రయత్నాలు సాగించటం అవసరం. వృత్తిపరంగా బాగా ప్రాబల్యం ఉండి ఆదాయం బాగుంటుంది. వ్యాపార వర్గాలకు ఆర్థిక స్థితి అభివృద్ధికరం. ఆదాయం బాగుంటుంది. అయితే అదనపు ఖర్చులు ఎక్కువగా ఉండినా డబ్బు సర్దుబాటు అవుతుంది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

శుభకార్యాల ఖర్చులు పెరగడం, తప్పనిసరి ప్రయాణాలుంటాయి. స్థిరాస్తుల క్రయవిక్రయాలు అనుకూలిస్తాయి. వృత్తిపరమైన ఆటంకాలను అధిగమిస్తారు. పనులు అనుకున్నవి సరిగా జరగక టెన్షన్ కలిగిస్తాయి. వ్యాపారవర్గాలకు ఆదాయం పెరిగి అభివృద్ధి బాగుంటుంది. కుటుంబ సమస్యలు ఉద్యోగ సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకొనండి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

మిమల్ని వ్యతిరేకించినవారే సన్నిహితం అవుతారు. షేర్లు స్టాక్ మార్కెట్లు లాభాలదిశగా సాగుతాయి. నూతన వ్యాపారాలు, ఉపాధులలో స్థిరపడతారు. వృత్తి జీవనంలో వ్యాపకం ప్రాబల్యం పెరుగుతుంది. వ్యాపారాలకు అభివృద్ధి, ఆదాయం బాగుంటుంది. అనవసర ఖర్చులు మైనబడినా సర్దుకుంటారు. అల్లుళతో తగాదాలు రావచ్చును. ఉదరకోశ బాధలు, శరీరానికి గాయాలు తగలవచ్చును.



### బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 29.8.2014 నుండి
తేది. 04.9.2014 వరకు

మీనరాశిలో కేతువు, కర్కాటకంలో గురుశుక్రులు, 31తేది నుండి సింహంలో శుక్రుడు, సింహంలో రవి, కన్యలో బుధరాహువులు, తులలో శనికుజులు, 4 తేది నుండి వృశ్చికంలో కుజుడు, కన్య తుల వృశ్చిక ధనూరాశులలో చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము:**

తేది 29 శుక్రవారము వినాయకచవితి.
భాద్రపదమాసము సెప్టెంబరు 17 వరకు శూన్య మాసము కాదు.
వ్యాపారలగ్నాలుండే అవకాశమున్నది.

**భాద్రపదమాస శుక్ల పక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 29 | శుక్ర | చతుర్థి | రా॥గం.12.32వ॥ |
| తేది. 30 | శని | పంచమి | రా॥గం.12.53వ॥ |
| తేది. 31 | ఆది | షష్ఠి | రా॥గం.12.46వ॥ |
| తేది. 01 | సోమ | సప్తమి | రా॥గం.12.05వ॥ |
| తేది. 02 | మంగళ | అష్టమి | రా॥గం.10.58వ॥ |
| తేది. 03 | బుధ | నవమి | రా॥గం.9.28వ॥ |
| తేది. 04 | గురు | దశమి | రా॥గం.7.40వ॥ |

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర్ష1, 2పాదాలు

దూరప్రాంతాలకు ప్రయాణాలుంటాయి. శుభ కార్యాలలో పాల్గొనడం, సభలు సమావేశాలలో ప్రాముఖ్యత గల పనులు నిర్వహించవలసి వస్తుంది. స్థిరాస్తుల లావాదేవీలు జరుగుతాయి. ఈ వారం ఖర్చులు బాగా పెరుగుతాయి. అయినా డబ్బు సర్దుబాటు అవుతుంది. వృత్తి వ్యాపారాలలో వ్యాపకం బాగుంటుంది. ఆదాయం పెరుగుతుంది. కుటుంబసౌఖ్యం బాగుంటుంది.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ప్రభుత్వ అనుమతులలో ఆలస్యం జరుగుతుంది. బంధుమిత్రుల అనారోగ్య వార్తలు వింటారు. మీ ఆరోగ్యం ఫరవాలేదు. వృత్తి వ్యాపారాలలో ఆదాయం బాగుంటుంది. కొత్త పథకాలు ప్రోత్సాహకాలతో ముందుకు సాగి ఆర్థిక స్థితిని మెరుగుపరచుకొంటారు. ఖర్చులు మాత్రం విపరీతంగానే ఉంటాయి. బంధువర్గంతో విభేదాలు రాగలవు. డబ్బుగాని వస్తువుగాని పోగొట్టుకొనే అవకాశం ఉన్నది.

## మిథునం



మృగశిర్ష 3,4 పాదాలు, ఆర్ధ్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

అనుకున్న పనులను పట్టుదల శ్రమతో సాధించుతారు. నూతన వస్తు వస్త్రాభరణాలు సమకూరడం, కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. ఆర్థిక వ్యవహారాలను, వృత్తి వ్యాపారాలను సమర్థవంతంగా నడుపుతారు. ఆదాయం పెరుగుతుంది. ఉద్యోగులకు పనివత్తిడి ఉండినా సామర్థ్యం బాగుంటుంది. ప్రజాజీవితంలోనున్న వారికి ప్రజాసంబంధాలు బలపడతాయి.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

గృహ నిర్మాణాలు, బ్యాంకు ఋణాలు అడ్డంకులు తొలగుతాయి. ఉద్యోగులు సమర్థత ప్రదర్శించి అధికారులకు సన్నిహితులుకాగలరు. వ్యవహారపరమైన వృత్తి పరమైన, కుటుంబపరమైన సమస్యలను అధిగమిస్తారు. వృత్తి వ్యాపారాలలో మంచి అభివృద్ధి అవకాశాలుంటాయి. మీటింగులలో, సమావేశ నిర్ణయాలలో ప్రముఖపాత్ర వహిస్తారు. కుటుంబసౌఖ్యం ఆరోగ్యం బాగుటుంది.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

చిరు వ్యాపారవర్గాలకు రాబడి బాగుంటుంది. కాంట్రాక్టర్లకు, స్టాకిస్టులకు స్వల్ప ఇబ్బందులుంటాయి. ఉద్యోగులపై ప్రభుత్వము అధికారుల వత్తిడి ఎక్కువగా ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి బాగుంటుంది. ఆదాయం బాగుండినా అనవసర ఖర్చులు పెరుగుతాయి. అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి. ఆశించిన అవకాశాలు చేజారిపోవచ్చును.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ప్రభుత్వ అనుమతులు ఆలస్యంకాగలవు. ఆరోగ్యం సరిగా ఉండదు. గాయాలు తగలవచ్చును. భాగస్వామిక చర్చలు, వాణిజ్య ఒప్పందాలు పరిష్కారానికి వస్తాయి. వ్యాపారాలలో ఆటంకాలను పోటీలను అధిగమించడానికి కష్టపడతారు. వృత్తి వ్యాపారాలలో ఆశించిన ఆదాయం లభించదు. పైగా శుభకార్యఖర్చులు, ప్రయాణ ఖర్చులు కొనుగోలు పెరుగుతుంది. పెద్దలను కలుసుకొనడం, సేవా కార్యక్రమాలలో పాల్గొనడం జరుగుతుంది.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వస్తు వాహన రిపేర్లుంటాయి. దూరప్రయాణాలు శుభకార్యాలలో పాల్గొనడం జరుగుతుంది. ఉద్యోగులకు పనివత్తిడి, అధికారులతో ప్రయాణాలుంటాయి. ఆదాయ వ్యయాలు అంచనాలకు భిన్నంగా సాగుతాయి. మంచి వ్యాపార అవకాశాలు పోగొట్టుకొంటారు. కుటుంబంలో వ్యక్తికి అనారోగ్య బాధలుంటాయి. ముఖ్యమైన పనులు వాయిదా పడగలవు. వృత్తిపరంగా బాగుంటుంది.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

నోటీసులు, బిల్లులు అందుకుంటారు. ఆర్థిక ఒప్పందాలలో జాగ్రత్త వహించండి. అనుకున్న సొంత పనులను, అధికారిక పనులను సమర్థవంతంగా నిర్వహిస్తారు. వృత్తి జీవనాధారం గల వారికి, వ్యాపార వర్గాలకు ఆదాయం పెరుగుతుంది. మార్కెటింగ్ వర్గాల వారికి, రియల్ ఎస్టేట్ రంగాల వారికి వ్యాపకం బాగుంటుంది. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. ఆరోగ్యం ఫరవాలేదు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

వ్యాపారవర్గాలకు స్వల్ప అభివృద్ధి, ఆదాయముంటుంది. అదనపు ఖర్చులుండినా సర్దుబాటు చేసికొంటారు. ఆస్తి వ్యవహారాలు, పంపకాలు వాయిదాపడటం మంచిది. వ్యవహారాలలో ఒప్పందాలలో జాగ్రత్తపడి పరిస్థితులను బట్టి సర్దుకొని పోవడం మంచిది. బుధ, గురువారాలలో బంధువులు సన్నిహితులతో విభేదాలు రావచ్చును. వృత్తిపరంగా బాగుంటుంది.

# టంగుటూరికి నివాళులు

నెల్లూరులోని రత్నమ్మ ఛారిటబుల్ సొసైటి, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన కొండాయపాలెం నగరపాలక ప్రాథమిక పాఠశాలలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకొని విద్యార్థులకు ఆటల పాటల పోటీలను సంస్థ అధ్యక్షుడు కె.మురళీమోహన్‌రాజు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేసారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న విశ్రాంత వాణిజ్య పన్నుల శాఖ సహాయ కమీషనర్ టంగుటూరి మహబూబ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి అయిన టంగుటూరి నీతివంతమైన పాలనను ప్రజలకు అందించి గొప్ప పేరు గడించారన్నారు. ఈ కార్యక్రమంలో స్కూలు ఉపాధ్యాయుడు హరీష్, పంచాగ్నుల విశ్వేశ్వరశర్మ, రవి గోగులపల్లి, రాచపాళెం రఘువంశీ, ఓమంపాటి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పింఛనుదారుల సమస్యలు పరిష్కరించాలి

జిల్లాలోని పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 24న స్థానిక ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్(1995) పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌కు విచ్చేసిన కేంద్రమంత్రి వెంకయ్యనాయుడును కలసి వినతిపత్రం సమర్పించారు. ధరల పెరుగుదలను దృష్టిలో వుంచుకుని పెన్షన్‌దారులకు కరువుభత్యం నిర్ణయించాలని, కనీస పెన్షన్‌ను పెంచాలని, రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ప్రతి పెన్షనర్‌కు ఆరోగ్యకార్డులు ఇవ్వాలని, తదితర కోర్కెలతో వారు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కృష్ణమూర్తి, సుబ్బారావు, ప్రసాద్, సుధాకర్, నరేంద్రసింగ్, కాశేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పోర్టు కోసం ఉద్యమం - చింతా

నెల్లూరుజిల్లా ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం వల్ల యూపిఏ ప్రభుత్వంలో దుగరాజపట్నం వద్ద మంజూరైన అతిపెద్ద పోర్టు ఇప్పుడు ఇంకో ప్రాంతానికి తరలిపోయే ప్రమాదం ఏర్పడిందని మాజీఎంపీ చింతా మోహన్ పేర్కొన్నారు. ఈ నెల 25వ తేదీన నెల్లూరులోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ పోర్టు వస్తే జిల్లాలో చాలామంది రైతులు లక్షాధికారులయ్యే వారని, లక్షమంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభించేవన్నారు. రాష్ట్ర విభజన బిల్లులో గత యూపిఏ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు పోలవరం ప్రాజెక్టును, దుగరాజపట్నంపోర్టును పొందు పరిచిందన్నారు. పోర్టు మంజూరై వందరోజులు దాటినా పనులు మొదలు పెట్టలేదని, దీనిపై సెప్టెంబర్‌లో లక్షకార్డులతో దేశ ప్రధాని నరేంద్ర మోడీకి లేఖలు రాయనున్నట్లు చెప్పారు. షార్ కేంద్రాన్ని సాకుగా చూపి మన జిల్లాకు మంజూరైన పోర్టును తరలించుకుపోవాలనుకోవడం సబబు కాదన్నారు.

# పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

\- జెసి రేఖారాణి



మొక్కలు నాటడం ద్వారా సమాజంలో మంచి ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని, మొక్కల పెంపకం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రేఖారాణి అన్నారు. ఈ నెల 24న స్థానిక నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక మద్రాసుబస్టాండ్ సమీపంలోని ఖాళీ ప్రదేశంలో మొక్కలు నాటారు. చిన్నారులందరూ మొక్కలను పెంచే కార్యక్రమాన్ని చేపట్టాలని, మొక్కలను బాగా పెంచిన వారిని అభినందించడం జరుగుతుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, ఈ మొక్కలు పెంచే కార్యక్రమాన్ని వారం రోజుల పాటు ఒక పండుగ వాతావరణంలా ఎంతో ఉత్సాహంగా చేపట్టాలన్నారు. ఇప్పుడు చేపడుతున్న 'నేను-నా చెట్టు' కార్యక్రమం విజయవంతం కావాలని కోరుతూ ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేత జక్కా వెంకయ్య, మునిసిపల్ రీజనల్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఇన్‌ఛార్జ్ డిఇఒ ఉష, టిడిపి నాయకులు తాళ్ళపాక అనూరాధ, కిలారి వెంకటస్వామినాయుడు, మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు, మై లవ్ అనే స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి జాన్ తదితరులతోపాటు పలువురు కార్పొరేటర్లు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## జడ్పీ తొలిసమావేశం

జిల్లా ప్రజాపరిషత్ పాలకవర్గం ఏర్పడిన తర్వాత తొలి సమావేశం సెప్టెంబర్ 10న నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో ఎం.జితేంద్ర తెలిపారు. ఆరోజు ఉదయం 10గంటలకు స్థాయీ సంఘాల సభ్యుల ఎన్నిక జరుగుతుందని, మధ్యాహ్నం 2గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రజాపరిషత్ సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, మండల ప్రజాపరిషత్ సభ్యులు, మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొనమని ఆహ్వానించారు.

# వేళాంగణిమాత మహోత్సవాలు 6 నుంచి



కోడూరులోని వేళాంగణిమాత ఉత్సవాలు వచ్చే నెల 6 నుంచి 8వతేది వరకు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 23న నెల్లూరు బిషప్ డాక్టర్ ఎం.డి ప్రకాశం సంతపేట బిషప్ చర్చిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ మహోత్సవాల ఏర్పాట్లను వివరించారు. ఈ ఉత్సవాలకు పెద్దసంఖ్యలో విచ్చేసే భక్తులకు అవసరమైన ప్రాథమిక వసతులు కల్పిస్తున్నామన్నారు. జిల్లావ్యాప్తంగానే కాక, దేశవిదేశాల నుంచి కూడా ఈ ఉత్సవాలకు భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేస్తుంటారని ఆయన పేర్కొన్నారు. వేళాంగణిమాత మహోత్సవాల బ్రోచర్లను ఆయన ఈ సందర్భంగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వేళాంగణిమాత చర్చి ఫాదర్ థామస్ అగస్టీన్, ఫాదర్లు పి. జోసఫ్, వైడి హృదయరాజ్, ఎం. హృదయరాజ్, సిస్టర్లు ఎంఆర్ త్రేసా, రీటా తదితరులు పాల్గొన్నారు.

## నూర్‌బాషా సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా కాలేషా

నెల్లూరులో ఈ నెల 24న జరిగిన నూర్‌బాషా సంక్షేమ సంఘం జిల్లా కమిటీ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడిగా షేక్ కాలేషాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. షేక్ మహబూబ్‌బాషా గౌరవాధ్యక్షుడిగా, చాన్‌బాషా ఉపాధ్యక్షుడిగా, షేక్ లతీఫ్ యూత్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. సమావేశంలో మాజీకౌన్సిలర్ సల్మా బషీర్, షేక్ బాబాసాహెబ్, షేక్ మీరాసాహెబ్, షేక్ ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ వైభవం...!



కావలి మాజీ శాసనసభ్యులు, ప్రస్తుత రాజధాని ప్రత్యేక కమిటీ సభ్యుడు బీదా మస్తాన్‌రావు - మంజుల కుమార్తె **మాధురి - మహితేజ్** (హైదరాబాద్ వాస్తవ్యులు కట్టెబోయిన గురవయ్య యాదవ్ - వనజల కుమారుడు)ల కల్యాణం ఈ నెల 14వ తేదీ చెన్నైలోని రాణి మేయమ్మై కల్యాణ మండపం నందు, అలాగే రిసెప్షన్ వేడుకలు ఈ నెల 17న హైదరాబాద్‌లోను, 20వ తేదీ నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్ హాల్‌లోను అంగరంగ వైభవంగా జరిగాయి నవదంపతులకు 'లాయర్' శుభాశీస్సులు.

# స్పీకర్ హుందాగా వ్యవహరించాలి

## - సర్వేపల్లి శాసనసభ్యులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మనుబోలు మండలంలోని చెర్లోపల్లిలో ఈ నెల 24న వైయస్సార్సీపీ నేత సి.బుజ్జిరెడ్డి నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో సర్వేపల్లి శాసనసభ్యులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వైయస్సార్సీపీ నేతలు, కార్యకర్తలను హత్య చేయిస్తూ ప్రతిపక్ష పార్టీ గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రతిపక్ష నేత జగన్మోహన్‌రెడ్డిని నరరూపరాక్షసుడు, దొంగ, ఉన్మాది వంటి పదాలతో టీడీపీ సభ్యులు దూషించిన సందర్భంలో ఆయన వారిని బఫూన్లుగా పేర్కొంటే, బాధ్యతారాహిత్యంగా జగన్మోహన్‌రెడ్డి మాట్లాడారని స్పీకర్ అనడం ఎంతో చిత్రంగా వుందన్నారు. స్పీకర్ హుందాగా పెద్దమనిషి తీరులా వ్యవహరించాల్సింది పోయి టీడీపీ సభ్యుడిగానే మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. రుణమాఫీపై తప్పించుకునే ధోరణిలో బ్యాంకులపై నెపం వేస్తూ పబ్బం గడుపుకోవాలని అధికారపక్షం రోజుకో మాట మాట్లాడుతోందని అన్నారు. హామీలను నిలబెట్టుకోవడంలో విఫలమైన టీడీపీ ప్రభుత్వం అసెంబ్లీ ప్రారంభం నుంచి ప్రతిపక్షం గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తోందని, అధికారపక్షం ఎన్ని జిమ్మిక్కులు చేసినా తమ పార్టీ ప్రజల పక్షాన నిలిచి పోరాడుతుందని స్పష్టం చేశారు. సమావేశంలో నేతలు బుజ్జిరెడ్డి, జయరామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రమణకుమార్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జైసమైక్యాంధ్ర నాయకులు, ఆనం జయకుమార్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 25వ తేదీన నెల్లూరులోని విశ్వభారతి అంధుల పాఠశాలలో అంధవిద్యార్థుల చేత కేక్ కట్ చేయిస్తున్న ఆనం జయ అనుచరులు, అభిమానులు.



ఈ నెల 26వ తేదీన నెల్లూరు పడారుపల్లి వికలాంగుల కాలనీలోని ఆచార్య పిసిరెడ్డి సమాజ మందిరంలో జరిగిన మధర్ థెరిస్సా జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ఇ.వి.యస్.నాయుడు, పి.జ్యోతి, ఆచార్య ఆదిత్య, క్రాంతి మహిళా మండలి అధ్యక్షురాలు జి.వెంకటలక్ష్మి తదితరులు

# మంచిర్యాలలో "ఎర్రచీమలు" ఆవిష్కరణ




అదిలాబాద్ జిల్లా మంచిర్యాలలోని సితార మినీఫంక్షన్‌హాలులో ఇటీవల తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో యువకవి వడ్డేపల్లి రాంప్రసాద్ రచించిన 'ఎర్రచీమలు' నానీల సంకలనాన్ని వేదిక రాష్ట్ర ప్రధానకార్యదర్శి ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ప్రముఖ రచయిత అల్లం రాజయ్య పాల్గొని మాట్లాడుతూ అదిలాబాద్ జిల్లా వైపు ప్రపంచమంతా దృష్టి పెట్టిందని, రాం ప్రసాద్ లాంటి ఈ తరం కవులు తమ నేల గురించి, తమ ప్రాంత అస్థిత్వం గురించి తెలుసుకోవాలన్నారు.

తెలంగాణ రచయితల వేదిక అదిలాబాద్ తూర్పు జిల్లా అధ్యక్షులు తోటపల్లి భూమన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏలేశ్వరం వెంకటేశం ఈ నానీల సంకలనాన్ని సమీక్షించగా తెరలే ప్రధానకార్యదర్శి తోకల రాజేశం, హెచ్.రవీందర్, జిఎం వెంకట్రామయ్య, గురిజాల రాధాకిషన్‌రావు, నీలాదేవి, బోనగిరి రాజిరెడ్డి, నూతన్, గుర్రాల వెంకటేశ్వర్లు, నాగవర్మ, చీపెల్లి బాపులు పాల్గొన్నారు.

# రాజకీయ జూదం

(మొదటిపేజీ తరువాయి)

మన రాష్ట్రంలో దరిద్రానికి తగ్గట్లే రిజర్వ్ బ్యాంకు కూడా ఋణాల రీషెడ్యూల్‌కు అంగీకరించలేదు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు అలాగే ఉన్నాయి. కనీసం రాష్ట్ర ప్రగతిలోనన్నా కదలిక వస్తుందా అంటే చంద్రబాబే హైదరాబాద్‌ను వదిలి రాక పోతుండడంతో ఇక ఏపిలో మాకు మాత్రం పనేముందంటూ పారిశ్రామిక వేత్తలు, ఐటి కంపెనీలు, సినిమా పరిశ్రమవాళ్లు ఇటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు.

చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాడనే గాని రాష్ట్రంలో అభివృద్ధి పరంగా ఎటువంటి కదలిక లేదు. చంద్రబాబు, మున్సిపల్ మంత్రి నారాయణలు విజయవాడ వద్దే రాజధాని అంటూ పదేపదే చెబుతున్నారు కాబట్టి కనీసం అక్కడన్నా కొంత చలనం వుంది. ముఖ్యమంత్రి, మంత్రుల వద్ద నుండి మాటలు తప్ప చేతలు లేవు. ప్రతి మంత్రి కూడా ఆరునూరైనా ఋణమాఫీని అమలు చేసి తీరుతామంటూ రెండ్రోజులకొకసారి రొటీన్ డైలాగ్ వదలడం తప్పితే ఇక చేస్తున్నదేమీ లేదు.

ఏపి అభివృద్ధిలో ఏదన్నా ముందుకు పోవాలంటే అది ఇక కేంద్రప్రభుత్వం దయా దాక్షిణ్యాల మీదనే ఆధారపడి వుంది. అయితే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకంగా కేటాయించే నిధులు, పనుల విషయాలలో టీడీపీ, బీజేపీలు ఎవరికి వాళ్లు రాజకీయ ప్రయోజనాల కోణంలో ఆలోచిస్తుండడం కొసమెరుపు. ఆంధ్రప్రదేశ్‌కు అన్నీ మేమే ఇచ్చాం అని చెప్పుకోవాలనేది బీజేపీ అధిష్టానం ప్లాన్‌లో భాగమైతే, కేంద్రంతో పోరాడి రాష్ట్రానికి ఇది నేను తెచ్చాను అని చెప్పుకోవాలనేది చంద్రబాబు వ్యూహం.

రాష్ట్ర విభజన బిల్లులో ఆంధ్రప్రదేశ్‌కు 5ఏళ్ల ప్రత్యేక ప్రతిపత్తితో పాటు, ఉత్తరాంధ్ర, రాయలసీమలకు ప్రత్యేకప్యాకేజీ, జాతీయ సంస్థల ఏర్పాటు ఆర్థికలోటును భర్తీ చేయడం, కొత్త రాజధాని నిర్మాణానికి కేంద్ర నిధులు వంటివన్నీ పొందుపరిచారు. వీటిలో ఇప్పటికే పోలవరం ప్రాజెక్ట్‌ను కేంద్రప్రభుత్వం ఆమోదించింది. తెలంగాణ, ఒడిసా వంటి రాష్ట్రాలు దీనిని వ్యతిరేకించినా పూర్తిగా కేంద్రం చొరవ తీసుకోబట్టే ఈ బిల్లు ఆమోదం పొందింది. ఇక రాష్ట్రంలో ఆయా జాతీయ విద్య, వైద్య సంస్థలను కేంద్రం మంజూరుచేసింది. ఏపి రెవెన్యూ లోటు, రాజధాని నిర్మాణానికి నిధులు, ప్రత్యేక ప్రతిపత్తి, ఉత్తరాంధ్ర, రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీలకు కేంద్రం ఆమోదం తెలపాల్సి వుంది. ఎలాగూ విభజన బిల్లులో వీటిని పొందుపరిచి ఉండడం, పార్లమెంటులో యూపిఏ బిల్లును ప్రవేశపెట్టినప్పుడు బీజేపీ కూడా దీనికి ఆమోదం తెలపడం జరిగింది. ఆరోజు రాజ్యసభలో ఏపికి 5ఏళ్ల ప్రత్యేక ప్రతిపత్తి కల్పిస్తామన్నప్పుడు దానిని పదేళ్లకు పెంచాలంటూ బీజేపీ నాయకులు వెంకయ్యనాయుడు డిమాండ్ చేస్తూ సవరణ కూడా ప్రతిపాదించారు. కాబట్టి ఇవన్నీ ఏపికి ఇవ్వక తప్పదు. ఆనాడు అన్యాయంగా జరిగిన విభజనను నరేంద్ర మోడీ తప్పుబట్టారు. బిడ్డకు పురుడుపోసి తల్లిని చంపేసారంటూ సానుభూతి చూపారు. దేశ వ్యాప్తంగా సాగిన మోడీ ప్రచారంలో కూడా ప్రతి చోటా ఈ అంశాన్ని ప్రస్తావించారు. కాబట్టి మోడీ చొరవతీసుకుని ఏపికి ఇవన్నీ ఇవ్వడానికి సిద్ధంగానే ఉన్నారు. కాకపోతే ఏపికిచ్చే ప్రతిదాని మీద బీజేపీ బ్రాండ్ ఉండాలని వారి ఆలోచన. భవిష్యత్‌లో ఇక్కడ పార్టీని బలోపేతం చేయాలనుకుంటున్నారు. కేంద్రం అందించే సాయం ద్వారా పార్టీ పునాదులను పటిష్టం చేయాలనుకుంటున్నారు. దీనిని పసిగట్టేనేమో చంద్రబాబు నేను పోరాడి ఇవి తెచ్చానని చెప్పుకోవడానికి ఢిల్లీకెళ్లి ప్రధానితో పాటు ఆయా శాఖల కేంద్రమంత్రులను వరుసబెట్టి కలిసారు. మరి ఈయన ప్రయత్నాలకు కేంద్రం ఎంత విలువిస్తుందో వేచి చూడాల్సిందే!

# నాయుడే ముద్దు

(మొదటిపేజీ తరువాయి)

చంద్రబాబుతో పొత్తే బీజేపీ నాయకులకు ఇష్టం లేదు. వెంకయ్య పూనుకోకుంటే ఆ పొత్తు ఉండేది కాదు. ఇక ఇప్పుడు కూడా నరేంద్ర మోడీని కలిసి ఏదైనా సాధించాలంటే చంద్రబాబుకు వున్న మార్గం వెంకయ్య నాయుడు. కాబట్టే ఆయన ఎటు చెబితే చంద్రబాబు అటు ఆడుతున్నాడు. చంద్రబాబుకు నెల్లూరు నాయుడేమో కావాలి గాని, నెల్లూరు అభివృద్ధి మాత్రం వద్దు.

# అడ్డదిడ్డంగా అసెంబ్లీ

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం చర్చను పక్కదారి పట్టిస్తుందేగాని, ఆరోగ్యవంతమైన చర్చకు ఆస్కారమివ్వడం లేదు. గత ప్రభుత్వంలో హత్యలు జరిగాయి కాబట్టి ఈ ప్రభుత్వంలోనూ చంపుకుని పోవడమే నీతా? ఇక దివంగతనేత వైయస్ పై అధికారపక్ష సభ్యులు పదేపదే ఆరోపణలకు దిగడం సంస్కారం కాదు. సభలోనే కాదు, ఈ భూమ్మీదే లేని ఒక వ్యక్తి గురించి ఐదేళ్లుగా మాట్లాడుతూనే ఉన్నారు. ఇంకా కూడా మాట్లాడుతుండడం ఎంత వరకు సబబు. అవినీతి కేసులు, హత్యలు చట్టం, న్యాయస్థానాల పరిధిలోనివి. వీటిలో వీళ్లు దోషులు అని చంద్రబాబు, ఆయన పార్టీ సభ్యులు నిర్ధారించలేరు.

ప్రతిపక్షనేత జగన్ కూడా తన పార్టీ మనుగడను కాపాడుకోవాలనే తపనతో అసెంబ్లీలో దూకుడుగానే వ్యవహరిస్తుండడం అధికారపక్షానికి మింగుడు పడడం లేదు. ప్రభుత్వం తీర్చలేని పలు సమస్యలతో ఊపిరాడని స్థితిలో వుంది. ఈ సమయంలో జగన్ దూకుడుగా ఈ సమస్యలపై నిలదీస్తుండడం అధికారపక్షాన్ని అసహనానికి గురిచేస్తుంది. దీంతో ప్రజాసమస్యలు గాలికి పోయి అసెంబ్లీ సమావేశాలు అరుపులు, వాకౌట్‌లు, నిరసనలకే పరిమితమవుతున్నాయి.

# ప్రసన్నకు పెత్తనం

(3వపేజీ తరువాయి)

పెట్టారు. ఆయన వచ్చాక నాయకుల మధ్య సమ న్వయలోపం కొట్టొచ్చినట్లు కనిపించింది. ఒకొరికొకరికి సంబంధాలే లేనట్లుగా పార్టీ తయారైంది. ఏ ఒక్క కార్యక్రమంలో కూడా పార్టీ జిల్లా అధ్యక్షుడు జిల్లా నాయకులం దరినీ ఒకే వేదిక మీదకు తేలేకపోయాడు.

ఎన్నికల తర్వాత పార్టీ ప్రక్షాళనపై దృష్టి పెట్టిన జగన్ నెల్లూరుజిల్లా పార్టీ కన్వీనర్‌గా నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని నియమించడం పార్టీ కేడర్‌కు కొంత ఉత్సాహం తెచ్చినట్లయ్యింది. నిన్నటి ఎన్నికల్లో కొద్ది ఓట్ల తేడాతో ఆయన ఓడి పోవడం జరిగింది. తన ఓటమికి ఎంపీ అభ్యర్థి మేకపాటి రాజమోహన్‌రెడ్డే కారణమని ప్రసన్న ప్రకటించి సంచలనం సృష్టించారు. ప్రసన్ననే ఇప్పుడు పార్టీ అధ్యక్షుడిగా నియమించడంతో పార్టీలో మేకపాటి కుటుంబసభ్యుల దూకుడుకు కళ్లెం వేసినట్లయ్యింది.

# గూడూరు డివిజన్ వార్తలు

## సమస్యలపై వినతుల వెల్లువ


బాధితుల సమస్యలు వింటున్న ఆర్డీవో శ్రీనివాసరావు

గూడూరు పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఆర్డీవో శ్రీనివాస రావు ప్రజావిజ్ఞప్తుల దినం నిర్వహించారు. పలువురు తమ సమస్యలను ఆర్డీవోకు విన్నవించు కొన్నారు. గూడూరు మండలం కొమ్మనేటూరు గ్రామానికి చెందిన ఏడుగురు రైతులు భూములను తెలుగుగంగ కాలువ నిర్మాణం కోసం సేకరించి కాలువను తవ్వారన్నారు. అందుకు సంబంధించిన పరిహారం నేటికీ అందలేదని భూనిర్వాసితులు ఫిర్యాదు చేశారు. చిల్లకూరు మండలం కడివేడులో సర్వేనెంబరు 960 నుంచి 968వరకు 65మంది భూమిలేని నిరుపేదలకు 1996లో సీజేఎఫ్ఎస్ క్రింద పట్టాలు మంజూరు చేశారని బాధితులు తెలిపారు. వీటిలో బయటప్రాంతానికి చెందిన భూస్వాములు పాగా వేసి అనుభవిస్తున్నారని వాపోయారు. స్థానిక రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్ళినా న్యాయం చేయడం లేదని, తమ వద్ద వున్న పట్టాలను చూపుతూ సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీవోను కలసి వినతిపత్రం సమర్పించారు. ఇంకా పలు సమస్యలపై బాధితులు ఆర్డీవోను కలిసి వినతి పత్రాలు సమర్పించారు.


సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కడివేడు గ్రామస్థులు

## ఇన్నర్‌వీల్ క్లబ్ బల్లల వితరణ



బల్లలను వితరణగా అందజేస్తున్న ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు

గూడూరు ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో 25వేల రూపాయల విలువ చేసే 40మంది విద్యార్థులు కూర్చునేందుకు వీలుగా బల్లలను పూలతోట గిరిజన కాలనీ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన పాల్గొని మాట్లాడుతూ విద్యాభివృద్ధికి తోడ్పాటునందించేందుకు ఇన్నర్ వీల్ క్లబ్ తరపున వితరణ కార్యక్రమం నిర్వహించిందన్నారు. ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు బొమ్మిరెడ్డి మైథిలి మాట్లాడుతూ ప్రధానంగా పేదలను ఆదుకునేందుకు అవసరమైన సేవా కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. మహిళలకు సంబంధించిన అనేక సేవా కార్యక్రమాలను చేస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ క్లబ్ సెక్రటరీ ఎల్లసిరి శ్రీలక్ష్మి, మహిళా మండలివారు విష్ణువందన, డాక్టర్ సి.రోహిణి, సునంద, సుదేష్ణ, ప్రధానోపాధ్యాయురాలు ఆదిలక్ష్మి, ఇతర ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా కౌన్సిలర్ల ధర్నా


పురపాలక కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న వైకాపా కౌన్సిలరు

గూడూరులోని వైకాపా కౌన్సిలర్లు తమ వార్డుల్లో సమస్యలు పరిష్కరించలేదని సోమవారం పురపాలక సంఘ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ నాశిన నాగులు మాట్లాడుతూ సనత్‌నగర్ ప్రాంతంలో తాగునీటి సమస్య ఉందని, పైపులైను నిర్మించాలని గతంలో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించు కోలేదన్నారు. అదేవిధంగా వార్డుల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని అర్జీలు ఇచ్చినా స్పందనలేదని, కావాలనే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణ చేశారు. రెండో పట్టణంలో నీటి సరఫరా సరిగా లేదంటూ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా నేటికి ఆ సమస్య అలాగే ఉందన్నారు. దీంతో పురపాలక కార్యాలయంలో తలుపులు మూసి ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని వైకాపా కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన


పురపాలక సంఘ కార్యాలయంలో మొక్కలు నాటుతున్న ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, మున్సిపల్ కమీషనర్ అనురాధ, కౌన్సిలర్లు

రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు నీరు - చెట్టు కార్యక్రమాన్ని ఆదివారం గూడూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన ప్రారంభించారు. పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో ఆమె మొదటి మొక్కని నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి అందరికీ ఆదర్శంగా ఉండాలన్నారు. పట్టణంలో కాలుష్యం విపరీతంగా పెరిగి పోయిందని, పచ్చదనంవల్ల కాలుష్యం నుంచి రక్షణ పొందగలమని తెలిపారు. సెప్టెంబరు 7వతేదీ వరకు 4000 మొక్కలను నాటుతున్నట్లు తెలిపారు. పట్టణంలోని ప్రతి పాఠశాలలోను ప్రభుత్వ స్థలంలోను మొక్కలు నాటాలని తెలిపారు. అనంతరం మున్సిపల్ కమీషనర్ అనురాధ నెహ్రూనగర్ వద్దగల సర్వేపల్లి రామారావు పార్కులో మొక్కను నాటి మాట్లాడుతూ గ్రీన్ గూడూరుగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని కోరారు. వైస్‌ఛైర్మెన్ శీలం కిరణ్‌కుమార్ మొక్కను నాటి మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు ప్రారంభించిన నీరు - చెట్టు అనే పథకానికి వరుణుడు కూడా కరుణించాడని వివరించారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి పరిరక్షణ బాధ్యతను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్లు బిల్లు చెంచు రామయ్య, రమేష్, భాను, పులిమి శ్రీనివాసులు, కృష్ణవేణమ్మ, మస్తానమ్మ, రాజేశ్వరమ్మ, షంషీర్, నాయకులు మనపాటి రవీంద్రబాబు, శ్రీహరి, కె.ప్రసాద్‌రెడ్డి, కృష్ణయ్య, శ్రీధర్, విశ్వనాథ్, నాగేశ్వరరావు, ప్రశాంత్‌కుమార్, పురపాలకసంఘం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి పోటీల్లో గూడూరు క్రీడాకారుల విజయం



షీల్డు తీసుకుంటున్న షేక్‌గౌస్, బషీర్

తమిళనాడులోని శివకాశిలో జరిగిన అఖిలభారత సబ్‌జూనియర్ ర్యాంకింగ్ టోర్నమెంట్ పోటీల్లో గూడూరు పట్టణానికి చెందిన క్రీడాకారులు షేక్‌గౌస్, సయ్యద్ బషీర్ ఆదివారం విజయం సాధించారు. టాప్‌సీడుగా బరిలోకి దిగి వరుసగా నాలుగు మ్యాచ్‌లను గెలిచి శనివారం తుది పోటీలకు చేరుకున్నారు. ఈ క్రమంలోనే ఫైనల్స్‌లో నవనీత్, విష్ణు వర్ధన్‌గౌడ్ జోడీతో తలపడి విజయకేతనం ఎగురవేశారు. పట్టణ క్రీడాకారులు జాతీయస్థాయిలో గెలుపొందడంపై దియంగ్ గూడూరు షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు జమాలుల్లా, అబ్దుల్‌కలాం హర్షం వ్యక్తం చేశారు. ఎలాంటి వసతులు లేని గూడూరు నుంచి జాతీయస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించి గెలుపొందడం శుభపరిణామమన్నారు. పట్టణంలోని పలువురు క్రీడాకారులు వారిని అభినందించారు.

## విద్యార్థులకు సమదుస్తులు

గూడూరు మండలంలోని తిరువెంగళాయపల్లి అంగన్‌వాడీ స్కూలు పిల్లలకు సోమవారం రాపూరు మాజీ ఎంపీపీ, దాత బండి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సమదుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చిన్నతనం నుంచే చదువుపై పిల్లలకు అవగాహన కలిగించేలా సహకారం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ సీడీపీవో ప్రమీలా రాణి, సూపర్‌వైజర్ రాధిక, అంగన్‌వాడీ సిబ్బంది ఈశ్వరమ్మ, సర్పంచి పండయ్య, గ్రామస్తులు ఎం.వెంకటయ్య, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## వాణికి ఆర్థికసాయం చేస్తున్న దాతలు



వాణికి నగదును అందజేస్తున్న సాయి సత్సంగ సేవాసమితి నిర్వాహకులు కోట సునీల్, చిరంజీవి అభిమాన సంఘం తరపున కొణిదల మునిగిరీష్.

గూడూరు నియోజకవర్గంలోని వాకాడు మండలం మొలగనూరు గ్రామానికి చెందిన యాటగిరి సీతమ్మ అనే గిరిజన మహిళ కుమార్తె వాణి ఉన్నత ఉద్యోగశిక్షణకు పలువురు దాతలు ముందుకొచ్చి ఆర్థిక సాయం అందిస్తున్నారు. గూడూరు పట్టణంలోని సాయి సత్సంగ సేవా సమితి నిర్వాహకులు కోట ప్రకాశం, కోట సునీల్ తమవంతు సాయంగా ఆమెకు రూ.15వేలు అందించారు. మాజీకేంద్రమంత్రి చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఇటీవల వాణి ఉద్యోగ సాధనకు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిసి చిరంజీవి అభిమానులు రూ.5వేలు చిరంజీవి యువత జిల్లా కో-ఆర్డినేటర్ కొణిదల మునిగిరీష్ ద్వారా అందజేశారు. ఈ క్రమంలోనే ఇటీవలే ఆమెకు రూ.30వేలును పలువురు దాతలు అందజేశారు. మొత్తం 50వేల రూపాయలు ఆర్థికసాయం అందినట్ల య్యింది. మిగిలిన నగదును కూడా దాతలు అందిస్తే హైదరాబాద్‌లోని ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసులో శిక్షణ తీసుకుంటానని విద్యార్థిని వాణి 'లాయర్'కు తెలియజేసింది.


ఇటీవల హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కలసి అభినందిస్తున్న గూడూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు, గవర్నమెంటు ప్లీడరు, జిల్లా తెలుగుదేశంపార్టీ మాజీ అధ్యక్షులు యరగుడిపాటి చలపతిరావు

సైదాపురం ప్రజానీకానికి, సిఆర్ఆర్ కాలేజీ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు, విద్యార్థినీ విద్యార్థులకు, తల్లిదండ్రులకు మరియు సిబ్బందికి

వినాయకచవితి శుభాకాంక్షలు.
చెన్నూరు విజయమోహన్‌రెడ్డి, కరస్పాండెంట్
సి.ఆర్.ఆర్. కాలేజ్
సైదాపురం, నెల్లూరుజిల్లా, సెల్: 94414 78020.

# ఆనంద వేదిక

వినాయకచవితి శుభాకాంక్షలతో...

**అనపల్లి అశోక్‌రెడ్డి**

సారథ్యంలో...



నెల్లూరులో రెండు అపురూప ఆవిష్కరణలు

# ఆతిథ్య వేదిక

నెల్లూరుజిల్లా కోవూరులో నేషనల్ హైవే ప్రక్కన వెలసిన

# అనపల్లి కన్వెన్షన్ సెంటర్

నిశ్చితార్థం, పుట్టినరోజు, పెళ్ళి, రిసెప్షన్, సభ, సమావేశం, సంబరం...





## వేడుక ఏదైనా.. వేదిక మీ కోసం

- 8 1/2 యకరాల విస్తీర్ణం
- 2500 సీటింగ్ సదుపాయం
- 30,000 చదరపు అడుగుల నిర్మాణం
- 500 కార్లకు పార్కింగ్ వసతి
- తొలిసారిగా ఎంట్రీ మరియు ఎగ్జిట్ పోర్టికోలు
- వసతి కోసం 6 గదులు
- ప్రాంగణానికి రెండువైపులా ఇన్‌గేట్, ఔట్‌గేట్ సౌకర్యం
- 10,000 + 10,000 + 5,000 అడుగులలో మూడు ఓపెన్ ఎయిర్ గార్డెన్‌లు

వేడుక మీది - వేదిక మాది

సంబరాలు మీవి.. సంతోషాలు మనందరివి




కోవూరు నేషనల్ హైవే ప్రక్కన, నెల్లూరు. ఫోన్. 87903 84844, 98481 21383

# సీజన్స్ ఇన్

BUDGET HOTEL WITH 3 STAR FACILITIES










నెల్లూరు నడిబొడ్డులో
అధునాతన వసతులతో
3స్టార్ సౌకర్యాలతో
అందుబాటు టారిఫ్‌లతో
అతిథ్యానికి సిద్ధంగా...

Seasons INN

Budget Hotel with 3 star Facilities

- 48 విశాల గదులు
- 12స్వీట్‌రూములు
- 3000 చదరపు అడుగుల రూఫ్‌టాప్ బ్యాంక్వెట్‌హాల్
- 3000 చదరపు అడుగులలో రెస్టారెంట్
- కారు పార్కింగ్ సౌకర్యం
- విశాలమైన కారిడార్‌లు



ఆతిథ్యం, ఆహ్లాదం, ఆనందం

## సీజన్స్ ఇన్‌లో మీ సొంతం

పోలీస్ ఆఫీస్ రోడ్డు, దర్గామిట్ట, నెల్లూరు. ఫోన్. 0861 - 2324001, 2324002

Email: reservations@seasonsinn.in, Web : www.seasonsinn.in


Edited, Published, Printed & owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published atRoopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY. e-mail: roopagroup@yahoo.com